సాహితీ విపణి

★

సమితి సభ్యులు

★

సాధన సమితి
సికింద్రాబాదు

సాధన సమితి కార్యనిర్వాహకవర్గము

తారణ నామ సంవత్సరము

★

అధ్యక్షులు

శ్రీ భాగి నారాయణమూర్తి

ఉపాధ్యక్షులు

శ్రీ కందాళ సత్యనారాయణ

కార్యదర్శి

శ్రీ జమ్మలమడక పూర్ణచంద్రరావు

సహాయ కార్యదర్శి

శ్రీ ముదిగొండ రాజేశ్వరరావు

సంపాదకవర్గము

శ్రీ పిల్లలమఱ్ఱి వేంకట హనుమంతరావు
శ్రీ జమ్మలమడక సూర్యప్రకాశరావు
శ్రీ భండారు చంద్రమౌళీశ్వరరావు

ఆడిటరు

శ్రీ నెలూరి రామమూర్తి

CHECKED

2355

ప్రత్యూష ప్రచురణము 12

సాహితీ విపణి

Checked 1987

CHECKED - 1993

*

సమితి సభ్యులు

*

సాధన సమితి

సికింద్రాబాదు

ఒక రూపాయి

సర్వస్వామ్యములు సమితివి

ప్రథమ ముద్రణము

2355

H·262

Book No. 15

మార్చి

1945

రామా ప్రెస్

సికింద్రాబాదు

మా మాట

తలచినట్లు తారణ కార్యక్రమం పూర్తి చేసుకుంది మా సమితి యీ ప్రచురణతో. పాఠకులకు ఖండకావ్య కథానిక ఏకాంకిక లందజేసుకుంది సమితి విపణిలో. ఈసారి వ్యాససంపుటికై తలపెట్టింది. కాని లోకుల భిన్నాభిరుచిని పురస్కరించుకొని యేకైక వస్తువుగాక బహువస్తువుల సమీకరించింది తన విపణిలో. కేవల ముత్పత్తిగాక వ్యాప్తి, వ్యయముగూడ అవసరంగదా వాణిజ్యాభివృద్ధికి!

పూర్వపు సభ్యులుగాక మరికొందరు సాధకులు సోదరి కస్తూరీదేవి, శ్రీయుతులు శేషగిరిరావు, విష్ణుజనార్దనరావు, ప్రభాకరరావు, వెంకటావధాని, సింగరాజు సోదరులతో చెలిమి సమకూరిందీ యేడు. మా యితఃపూర్వపు ప్రచురణతో శ్రీ ప్రభాకరరావుగారు పాఠకలోకానికి పరిచయమైనారు. మిగిలినవారుగూడ పత్రికా ముఖాన ఇంతో— అంతో— పరిచయులే.

మహాసంస్థలే యుద్ధవాయువు లెదుర్కొనలేక తల లొగ్గుతున్నాయి. పసితనములో మా సమితి యథారీతిముందంజ వేస్తోందంటే సభ్యుల సమధికోత్సాహం, స్వార్థరహిత సేవ— కారణాలు. ఈ ప్రచురణకార్యసిద్ధికి శ్రీ బూర్గుల రంగనాథరావుగారెక్కువ భాగం పంచుకున్నారు. వారికి వారిద్వారా పరిచయమైన పోషకవర్గానికి మా అభివందనాలు.

హైదరాబాదు రేడియో నిలయమునుంచి ప్రసారితములైన ప్రసంగాలను ప్రచురింప అనుమతించినందుకు నిలయమువారికి మా కృతజ్ఞత.

పార్థివ నిజచైత్ర శుద్ధ పాడ్యమి — కార్యవర్గము.

ఆవిష్కరణము

సాహితి సకల హితైకసార ప్రతిపాదనాసమర్థమై, మానవలోకోద్ధరణోద్దేశితమై, సహజ రసానందమూర్తియై యొప్పారునది. ఆంధ్రసాహితీ సాధకుడు నేటి కనేక ప్రక్రియలలో శారదను దర్శించి, యుపాసించి, యావిష్కరించినాడు.

ఆంధ్ర గృహములలో 'సాహిత్యదీపములు' వెలుగొందవలెనని ప్రబోధ మెన్నడో సల్పినాడు కవి. సాహిత్యార్చనము సంపూర్ణావకాశమును పొందలేదు. మినుకు మినుకు మనుచున్న సాహితీ రోచిస్సులు ప్రజ్వలితములు గావలెను.

ఈ మహదాశయమే సాధన సమితిని పాలించుచున్నది.

ఇట్టి సత్సంకల్పముతో, సహృదయలోక సమాదరముతో సాధన సమితి యేడెనిమిది వత్సరములు సాహితీసేవ చేసి యిప్పటికి పండ్రెండు ప్రచురణముల వెలువఱచినది. 'కల్లబొల్లి కబుర్లకన్న కార్యరూప సాధనమే ఘన'మని యీ సమితిసేవ యొసగు గుణపాఠము.

నిరంతర సాధనావశమున నలవఱచుకొనుచున్న శిల్పహృదయమును, మధురభావమును, నిశితగ్రథనాకౌశలమును ప్రకటించు వివిధ ప్రక్రియా విశేషములనే యీ 'సాహితీ విపణి' లో మనము సందర్శింపబోవునది.

వీనిలో గొన్ని రేడియో ముఖమున ప్రసారితములై సభ్యుల యభ్యుదయమును జాటుచున్నవి. ఇందలి వ్యాసములలో సభ్యులు ప్రతిపాదించిన సిద్ధాంతములు నూతనములు; ప్రత్యేక వ్యక్తిత్వ ప్రకాశితములు. ప్రతిభాసమన్వితములట్టివే గదా!

అధికారానుగుణముగా సహృదయులు 'వినోద' లో విహరించి మూర్తుల దర్శించి, గ్రహించి మన్నింతురుగాత!

ఇదే యావిష్కరించుచున్నాను.

గుంటూరు }
30-3-45. }

పిల్లలమర్రి వేంకట హనుమంతరావు,
శారదాపీఠము.

సామగ్రి

వస్తువు		విహారులు
1. దేహి	[ప]	శ్రీ యాంసాలి విష్ణుజనార్దనరావు
2. సాహిత్యోద్దేశము	[వ్యా]	శ్రీ పిల్లలమర్రి వేంకటహనుమంతరావు
3. రెండు ఛాయలు	[క]	శ్రీ నెల్లూరి కేశవస్వామి
4. తిక్కన కవితా ప్రతిభ	[వ్యా]	వెంద్రండ ప్రభాకరరావు
5. పిచ్చిక గూడు	[క]	శ్రీ భాగి నారాయణమూర్తి
6 వసూథినీప్రవరాఖ్యులు	(వా)	శ్రీ జమ్మలమడక సూర్యప్రకాశరావు
7 స్వాతంత్ర్య యోగము	[భా.గ]	శ్రీ పరిమి వెంకటావధాని
8 కథానిక	(వ్యా)	శ్రీ బూసల రంగనాథరావు
9 ఆత్మార్పణం	(క)	భండారు చంద్రమౌళీశ్వరరావు
10 ముక్తిపథంచు	(గే)	శ్రీ సింగరాజు లింగమూర్తి
11 ఆషాఢ కన్య	(గే)	శ్రీ విష్ణుభొట్ల కామేశ్వరరావు
12 పెరటి చెట్టు	(క)	శ్రీ మతి ఇనస్తాదేవి
13 ప్రబోధము	(గే)	శ్రీ సింగరాజు ధారాధర రావు
14 అస్తమయం	(భాగ)	శ్రీ జమ్మలమడక పూర్ణచంద్రరావు
15 రాష్ట్ర గీతి	(గే)	శ్రీ మానూరి కేశవగిరిరావు

దేహి

'యాంసాని విష్ణుజనార్దన్'

సతతంబు న్నిను నాత్మ గొల్చుచును సంసారేచ్ఛ వీడంగ జీ
వితమి ట్లర్పణ జేసినట్టి నను దుర్భాగ్యుండుగా జేసి తీ
వతి ఘోరంబగు పాపకూపమున మాయాంభోనిధిన్ ద్రోసి; ఆ
శ్రితునై మ్రొక్కెద జేర్పవే దతిహరా! శ్రీరామలింగేశ్వరా!

మనమం దెన్నడు నిన్వినా యితరదైవంబున్ తలంపంగ జా
లను, కించిత్కరుణా రసంబొలుకగన్ లాలించి దాసానుదా
సుని గావించి విపత్సముద్ర గరళస్ఫూర్తిన్ నివారింపచే
సి ననున్ గావగదయ్య ఫాలనయనా శ్రీరామలింగేశ్వరా!

ఎంతేనిన్ విపరీతమయ్యెగద మజ్జీవేచ్ఛ సర్వంబు; నా
పంతంబంతయు రిక్తమయ్యెగద; విశ్వం బెంతగా మారినన్
సంతోషించెదవే కృపానిధి! గిరీశా! మదిన్ నమ్మినన్
చింతాక్రాంతుని జేసివేసితివిగదా శ్రీ రామలింగేశ్వరా!

గ్రైవేయంబులు భూషణంబులగు; దుర్గాదేవి యర్ధాంగియా
నీ విశ్వంబు స్మశానవాటికయగున్; నీ మేను చర్మంబగున్;
నీ వైభోగము భస్మమౌగనుకనే నీకింత క్రౌర్యంబొకో!
శ్రీ విశ్వేశ్వర ఫాలలోచన! శివా! శ్రీ రామలింగేశ్వరా!

తరమే ధాతకు ధాతతాతకును నీ తత్త్వం బెఱుంగం భవ
త్కరుణా వీక్షణ మాలికల్ పరిపి భక్తానేకము న్నేలు నా
సరణిన్ మా కొసగంగదే సుకవితాచాతుర్య సామర్థ్యమున్
స్థిరమైనట్టి యశంబులన్ సుఖములన్ శ్రీ రామలింగేశ్వరా!

సాహిత్యోద్దేశము

—పిల్లలమఱ్ఱి వేంకట హనుమంతరావు

లోక వ్యవహారములో సాహిత్యము-సారస్వతము-వాఙ్మయమను పదములు సమానార్థక పదములుగా ప్రద్యోతమగుచున్నవి. కాని యీ మూడు పదము లర్థములో నరితరము కలవిగా పరీక్షపై తెలిసికొనగల్గుదుము. సాహిత్యమనునది దేశకాల పరిమితముగాక, సర్వకాల సర్వజనీనమ్ముగా నుండి విశ్వశ్రేయస్సునుగోరి నిర్మింపబడిన కావ్యసంచయమునకు చెందును. సారస్వతమనునది యక్షర రూపమైన సకల విద్యాశాస్త్ర కళాదులకు వర్తించును. వాఙ్మయమనగా వాక్కుయొక్క వికారము అనగా లిఖితసంభాషణాది సమస్త వాగ్వ్యవహారమునకును వాఙ్మయమను పదము చెల్లును. ఇదిసర్వసాధారణమైనపదము. సాహిత్యము— సారస్వతము— వాఙ్మయము. ఇవి యుత్తరోత్తర విశాలములైనవి. ఈ మూడు నొకే కేంద్రముగల మూడు వలయముల వంటివి. సాహిత్యము పరిమిత వలయము; దీనిని సారస్వతవలయము చుట్టినది. ఈ రెంటిని చుట్టినది వాఙ్మయవలయము. సాహిత్యమును, సారస్వతమని, వాఙ్మయమని పిలువవచ్చును. కాని సారస్వత వాఙ్మయము లను-వి సాహిత్యమునకు వర్తింపవు.

ఇక ఉద్దేశమను పదము—ప్రతి వస్తువునకు కార్యకారణ భావమున్నది. ఘటమునకు మృత్తిక కారణము;

అశ్లే మానసిక సంబద్ధ విషయములకును, మానవుఁ డే కార్యము నిర్వహించినను వెనుక నొక యాలోచన యుండి తీరును. ఈ యాలోచనమునే యుద్దేశమని, కారణమని యననగును. ఇది పునాదివంటిది. ఒక యుద్దేశమును పురస్కరించుకొని మానవుఁ డొక కార్యము నిర్వహించును. అతఁ డాసించిన యా యుద్దేశము పరిణామ ఫలముగా తిరిగి ప్రతిఫలించును. ఉద్దేశ్యము—కార్యము—పరిణామము: ఇది క్రమము. వీనిలో నుద్దేశము లోచించినను, పరిణామ పరిశీలనముచే దానిని గుర్తింప వచ్చును. ఒక్కొక్కప్పు డుద్దిష్ట పరిణామము కలుగక పోవచ్చును. కాని కార్యమునుబట్టి దాని నెరుగవచ్చును. ఇవ్విధముగా నుద్దేశ కార్య పరిణామము లన్యోన్యాశ్రయములు.

కాగా, సాహిత్యోద్దేశ మిప్పుడు ప్రసక్తము. సాహిత్యము "సత్యం, శివం, సుందరం" అను పరమాశయములు నిమిడ్చికొనినది. సాహిత్యమునకు కవి—విమర్శకులు ప్రవర్తకులు. సౌందర్య ద్రష్టయు స్రష్టయు కవి. దీననే యాతని "కవి బ్రహ్మ" యనినారు. విమర్శకుడే తద్వ్యాఖ్యాత. సాహిత్య మొక మధుర దర్శనము. తదితర దర్శనముల నవలోకించుట కెంతటి యధికారము వలయునో సాహిత్య దర్శన సాక్షాత్కారమున కంతటి యధికారము వలసి యున్నది. సహృదయత్వము, రసజ్ఞత, వ్యుత్పన్నత సాహిత్యారాధనమున కుపకరణములు.

సహృదయత్వ మనగా హృదయము కలిగి యుండుట యని సామాన్యార్థము. ప్రతివానికి హృదయమున్నదిగదా

కాని యది యున్నటుల తెలియువాడే సహృదయుడు. అనగా నాత్మ వేదనోన్ముఖమైన యంతరంగము కలవాడు. నిష్పాక్షికముగా, నిష్కలంకముగా, సానుభూతితో నాయా వాతావరణముల యందు సంచరింపగలిగి యాయా పాత్రలనుగాని, విషయములనుగాని యవలోకించి తత్తదనుగుణముగా స్పందించు హృదయము కల్గియుండుట.

రసజ్ఞత యనగా రసము నెఱుగుటయని వాచకార్థము. అనగా విభావాను భావ సాత్త్విక వ్యభిచారీ భావసంయోగ ఫలితముగా పర్యవసించు రసస్వరూపమును దెలియుట. విభావాదికముల నెఱుగకయే యాయా భావములకు తత్తదనుగుణముగా సంచలనము పొందువారును రసజ్ఞులే. లక్షణాదికము నెఱిగియు రసజ్ఞులు కానివారున్నారు.

ఇక వ్యుత్పన్నత యనగా లోకశాస్త్రానుభవముతో కూడిన పాండితి. పరిజ్ఞానము సమకూర్చుకొనుటలో దేశాటనము, బహు కావ్యపఠనము, సంప్రదాయజ్ఞులైన మహాత్ముల సాంగత్యము మున్నగునవి తోడ్పడవలెను. ఇన్నిటితో నుదయించిన సంస్కారమే వ్యుత్పన్నత యగును. ఇన్ని కల్గియు సంస్కారము పొందనివారున్నారు.

ఈ యుపకరణములతోడనే సాహిత్యారాధనమునకు పూనుకొనవలెను. అప్పుడే సాహిత్యోద్దేశమును గ్రహింపవచ్చును. ఎంతవరకీ యుపకరణములు లేక పరిశీలించుచుందురో యంతవరకు సాహిత్యోద్దేశము ప్రశ్నారూపముననే యుండి యనేక యపోహలకు తావిచ్చును. నేడు లోకమున

వ్యవహరింపబడుచున్న సాహిత్యముగాని, సాహిత్యోద్దేశ మను నట్టిదిగాని, నిత్యమైన సాహిత్యపరములుగావు. సార్వజనీన సార్వకాలీనతలందు వ్యాగ్యము.

సాహిత్యోద్దేశ మన్ని కాలములందును, అన్ని దేశములందు నొక టేయయి యుండును. జీవితోద్దేశమెట్లు బ్రహ్మానందానుభవమో అట్లే సాహిత్యోద్దేశము సైతము బ్రహ్మానంద సహోదరమగు రసానందానుభవమగును "రసోవైసః" అను శ్రుతివాక్యము జీవితమునకు సాహిత్యమునకు చెందినది. ఋషిప్రోక్తమైన వాక్యము బ్రహ్మానంద సాధకులకు ప్రమాణము. రసానంద పిపాసులకు కవి వాక్య మట్టి ప్రమాణము. కవి ఋషితుల్యుడు. కావుననే 'నానృషిః కురుతే కావ్యం' అనినారు.

మోక్షగాములకె ట్లనేక పథము లనుగమ్యమానములై ప్రతీయమానములగు చున్నవో యట్లే సాహితీ దర్శనా లక్ష్యమును గడించుట కనేక మార్గము లాయాయుగములలో ననుగమ్యమానములైనవి. ఆయా మార్గములే యాయా కాలానుగుణముగ నుద్భవించిన ఉద్యమముల పరిణామములు.

వైదిక వాఙ్మయముయొక్క గహనతయే పురాణ గ్రంథరచనోద్యమమునకు హేతువు. శైవవైష్ణవ సంఘర్షణమే వీర శైవవైష్ణవోద్యమములకు కారణము. అనుకరణ బాహుళ్యమే స్వతంత్ర రచనోద్యమమగు ప్రబంధ ప్రక్రియకు దారి తీసినది. కర్మసిద్ధాం తాచరణాశక్తతయే 'భక్తి మార్గావలంబనమునకు కారణము. ప్రాచ్యసాహిత్య

సూత్రములపై ప్రత్యయము లేక పోవుటవలన నేమి, కాలా భావము వలననేమి, సామాన్యజనుల కందుబాటులో సాహిత్యము నుంచవలెనను ఉద్దేశమే, నవ్యసాహిత్యోద్యమమునకు మూలము. ఈవిధముగా నుద్యమములు బయలుదేరి సాహిత్యము ననేక గతుల నడిపినవి.

ప్రాచీన లాక్షణికుల సాహిత్యోద్దేశమును గమనింతము. సప్త సంతానములలో కావ్యము శాశ్వతమైనది. "విశ్వశ్రేయః కావ్యమ్" అనినారు. అనగా, సార్వజనీనత యుండవలెనని సూచ్యార్థము. "వ్యవహారవిదే శివేతరక్షతయే సద్యః పర నిర్వృతయే కాంతాసమ్మిత తయోపదేశయుజే" అనుటలో విశ్వశ్రేయస్సెట్లు కలుగవచ్చునో లక్షీకరించినాడు. కావ్యాత్మ మీమాంస యొనరించి లాక్షణికులు రసానందానుభవమునకు కావ్యమందలి వివిధాంశలను పృథక్కరించినారు. అవే రస, అలంకార, గుణ, రీతి, ధ్వని, వక్రోక్తి అనుమాన, ఔచితులు. లక్ష్య మొక్కటే నాటికీ నేటికీ. దానిని సమీపించు మార్గములు మాత్రము భిన్నములు.

జీవిత లక్ష్యమును సాధించుటకు కర్మ, జ్ఞాన, భక్తి మార్గములుద్దేశింపబడినవి. ఆత్మానందమే పరమోత్కృష్టమైన జీవితధర్మము. తదానంద సంధానమునకే యీ మార్గములు. సాహిత్య మీ త్రిమార్గాశ్రయము. ప్రభు, సుహృత్కాంతా సమ్మితములని లాక్షణికుడు వ్యపదేశించినాడు. వేదములు కర్మను విధించునవి. పురాణములు ధర్మపదమ్ముల

నడచిన వారినిగూర్చి నివేదించి కర్తవ్య ధర్మముల నిరూపించి ఫలాపేక్షలో మనుజునికి న్యోత్సాహము కల్పించునవి. కావ్యము లోకమును మరపించి మురిపించునది. అది కాంత హాస్యమువలె సుస్మితముగ, సుకుమారముగ, లలితముగ, వ్యంగ్యమాత్ర విలసనముతో సంస్కరించునది.

సాహిత్యము సౌందర్యమూర్తి. సౌందర్యావిష్కరణాస్వాదనములు సహృదయ వేద్యములు. సాహిత్యోపాసనమే యీశ్వరోపాసనము. ఇదే సౌందర్యోపాసనము. రససిద్ధి లేక సౌందర్య సాక్షాత్కారమే ఫలము. ఇయ్యది యలౌకికానంద స్వరూపము. అతీంద్రియమైనది. ఇట్టి యానందమును సశరీరముగ ననుభవింప దగినది.

సాహిత్యము రాజస తామసవృత్తులను లీన మొనరించి, శుద్ధసత్త్వమును ప్రకాశింపజేసి తద్వారమున సౌందర్యాలోకనమున కర్హత నిచ్చునది. సాహిత్యము నిరంతర భావనా విశేషముచే పరబ్రహ్మానంద సహోదరమగు నానందము నాస్వాదింప జేయునది. నిత్య చైతన్యము గలిగినట్టి, శుభప్రదమైనట్టి రసానుభవమును కల్గించి మనోనేత్రమునకు దివ్య సాక్షాత్కారము కల్గించునది సాహిత్యము.

ఇట్టి పరమోత్కృష్ట ఉద్దేశముగలది సాహిత్యము. అందుచేతనే అది మధురదర్శనమైనది.

(ఇది 'హైదరాబాదు రేడియోనిలయము'నుండి 6-6-44 తేదీన ప్రసారితమైనది.)

రెండు పాయలు

—నెల్లూరి కేశవస్వామి

"ఏక్ కప్ చాయ్ లావ్ ?"

పరిచిత కంఠము వినపడగానే ఫులిక్కిపడి తిరిగి చూశాడు వాసు.

ఖాసిం! ఖాసిమేనా ?

వాసు హృదయము ఒక్కసారి ఆగి తిరిగి కొట్టుకో సాగింది తీవ్రంగా.

చేతులు వణికాయి. ఓ చేతిలో మైసూరుబోండా రెండో చేతిలో నీళ్ళు తొణికిసలాడాయి. చూస్తున్నాడు. చూస్తున్నట్టుగానే నిలుచుండి పోయాడు నిశ్చేష్టుడై.

"ఏ అయ్యర్! తీసుకరావేం" ఆంధ్రమహాశయుడిలాగా అన్నాడు. ఆదెబ్బకు తేరుకున్నాడు వాసు. చప్పున బోండాప్లేటూ నీళ్ళగ్లాసూ తీసికెళ్ళి ఆ మహాశయుడిముందు పెట్టాడు. మళ్ళీ ఖాసింను చూట్టం మొదలెట్టాడు. ఖాసిమేనా! ఈ వేషమేమిటి? బ్లూ బ్లేజర్ కోటు తెల్లనిసిల్కు ఆఫారము తెల్లనెక్కటై, మెడకు మఫ్లరు, నల్లఫ్రేము కళ్ళద్దాలు, కాళ్ళకు తెల్లసాక్సు, షూస్; ఉంగరాలు ఉంగరాలుగల జుట్టును బాగా వెనక్కు ఎగదువ్వేడు. కుడి మోచేయి టేబిలుపైన మోపి, అరచేతులో గడ్డం ఆనాచి వీధిలోకే చూస్తున్నాడు, నిశ్చలంగా. ప్రక్క కుర్చీపై 'టెన్నిస్ రాకెట్' పెట్టివుంది.

ఖాసిమేనా? మళ్లీ సందేహం కలిగింది వాసుకు. దాంతోపాటు కాస్త నిరుత్సాహంకూడా కలిగింది. దగ్గరికి వెళ్ళి చూస్తే? కనుక్కుంటే? తీరా ఖాసిమే అయి తనను గుర్తిస్తే ఈ స్థితిలో ఖాసిం ఎదుటపట్టమే? ఎంత అవమానం! ఛా వద్దు... ఖాసిం కంటపడకుండా దూరంగా వెళ్ళి ఓ పెద్ద మనిషితో తగ్గు స్వరములో "ఏంకావాలి సార్" అన్నాడు వాసు. అంతసేపూ ఓకంట ఖాసింను కనిపెడ్తూనే వున్నాడు. ఆ పెద్దమనిషి జవాబు యివ్వకముందె ఖాసిం మొహం ఇటు తిప్పి "చాయ్ లావ్" అనేసరికి వాసు ఒక్కగంతులో మళ్లీ అలమారాల వెనక్కి వొచ్చేశాడు. ఈసారి గుండె మరీ తీవ్రంగా కొట్టుకోసాగింది. మొహాన్ని చెమటల్ని చూపుడు వేలుతో తుడుచుకుంటూ "నన్ను చూడ లేదుగదా!" అనుకున్నాడు. తినుబండారాలున్న రెండు అలమారాల మధ్య సందులోనించి చూడసాగాడు ఖాసిం ముందర టీ కప్పు పెట్టి వుంది. ఖాసిం అందులో స్పూన్ తిప్పుతున్నాడు. కాని దృష్టిమాత్రం వీధివేపే వుంది. ఎదుట పెద్ద గడియారములో **5-50** అయింది. ఆ పక్కనిది మిడిల్ స్కూల్ గోడలు కనిపిస్తున్నాయి. అవి కనిపించగానే వాసు ఆలోచనలో ఓ పది సంవత్సరాలు వెనక్కి తిరిగాయి.

ఆ స్కూల్లోనే తానూ ఈ ఖాసిమూ ఆరు సంవత్సరాలు జంటగా చదివింది. ఆ స్కూల్లోనే వాళ్ళ స్నేహలత యంకురించింది. పెరిగింది. ఆఖరికి అంతరించిందికూడాను. ఈ స్నేహమేకాదు వాసు జీవితంలోనిదో ముఖ్యఘట్టం—

మధురఘట్టంకూడా అంత మొందింది, ఆ స్కూలుతోనే. తాను ఒకే ఒక్క కొడుకు సంతానం. ఎంతో గారాబంగా పెంచిన తల్లిదండ్రులు జ్ఞాపకమొచ్చారు. ముఖ్యంగా ప్రేమ పూర్తి అమ్మజ్ఞప్తికిరాగానే గుండె బరువెక్కింది. వచ్చే కొద్ది ఆదాయమూ జూదాలలో తగలేస్తున్నా తనకేకష్టము రాకుండా థర్డుఫారం వఱకు హాయిగ వెళ్ళబుచ్చింది అమ్మ, కాని ఫోర్తుఫారంలో చేరాక ప్లేగు. ప్లేగు—ఆరోజుల్లో ప్రతియేటా వచ్చేది. మహాంకాళి పూజలు వారూ తిరక్కుండా అమ్మా నాన్నా ఇద్దఱినీ పొట్టబెట్టుకుంది. మామయ్య వచ్చాడు. చదువుకు స్వస్తిచెప్పించి ఇల్లు ఖాళీచేయించి తన వెంటేసుకపోయాడు వూరికి. అక్కడ తన రాక అత్తయ్య ఎంతమాత్రం యిష్టంలేదన్న సంగతి మొదటిరోజే గ్రహించుకో గలిగాడు. తనకేపదేనా ఆస్తి అనేది వుంటే అందరూ చేరదీసేవారేమో, తాను వాళ్ళింట్లో నిలవలేకండా చేయగలిగిందంతా చేసింది అత్తయ్య. ఆఖరుకు ఓరోజు మామయ్య లేకుండా చేసి తన కొడుకుని కొట్టాడన్న నెపం మీదగా, దాంతో వాసుకు హడలెత్తి అదేరాత్రి యెవరికి తెలియకుండా వెళ్ళి రైలెక్కాడు. టిక్కట్టు లేకుండానే ప్రమాణం చేస్తూ మధ్య కనీసం పదిసార్లన్నా దాచేసినా పట్టుపడకుండా ఎల్లానో అల్లా పదిహేనురోజులు తర్వాత బొంబాయి చేరుకున్నాడు. అక్కడపడ్డపాట్లు యిన్నిఅన్నిగావు.

ఈరానీ హోటలులో టేబిలు తుడిచాడు. పత్రిక అమ్ముతూ తిరిగాడు. బూట్లకు పాలిషుచేశాడు. స్కూలుకు

బుక్సు మోసుకపోయాడు. స్టూడియో బాయ్‌గా పనిచేశాడు. జేవియర్ కాలేజిహాష్టలులో సర్వరుగా కుదిరాడు. ఇంత చేసినా పూట కాపూటకు సరిపోదు. పస్తుండటం తిట్లు తినటంగానే అలవడిపోయినాయి. ఆఖరికి ఆరువత్సరాలు తిరిగి తిరిగి పట్నము వచ్చినప్పుడు జేబులో ఎక్కడా ఏగాణి లేదు. బొంబాయిలో కాలుపెట్టగానే తెంపి పారవేసిన జంధ్యము మళ్లీ తగిలించుకొని ఈ అయ్యార్ హోటల్లో సర్వర్‌గా చేరగలిగాడు. ఇది మాత్రమే శాశ్వతం. రేపు మళ్ళా విధి ఎటు తన్నుకుపోతుందో, ఏమో—ఒక వేడి నిట్టూర్పు విడిచాడు వాసు.

పెద్దగడియారం నాలుగు పావులూ ఆరుగంటలూ కొట్టింది. ఖాసిం తన ఎడమచేతినున్న రిస్టువాచిలో టైమ్ సరిచూచుకున్నాడు. టీ పూర్తి అయింది జేబులోనుంచి గోల్డుఫ్లేక్ సిగరెట్ తీసి ముట్టించాడు.

వాసు యింకా రెండు అలమారాల మధ్య సందులో నుంచి చూస్తునే వున్నాడు. వాసు పనేమీ చెయ్యకుండా అల్లా నిల్చోటం చూచి తోటి సర్వరు సుబ్బులుకు వళ్ళు మండుకొస్తుంది. ఇంగె యేంచేస్తుండావురా అన్నాడుకూడ ఓ సారి. కాని వాసుమాత్రం అప్పుడు ఎవరినీ ఖాతర్ చేసే స్థితిలో లేడు. తన్ను కాదన్నట్లుగానే దులిపేసి మళ్లీ తన రివెరీస్‌లో మునిగిపోయాడు.

ఖాసింఅల్లా మిడిల్‌స్కూలుకేసి చూస్తూఆలోచిస్తూనే వున్నాడు, అసలేమిటా ఆలోచన తన గత జీవితం జ్ఞాపక

మొస్తుందా వాసుకు జ్ఞాపక మొస్తున్నాడా! మెడమీద చిరిగిన షేర్వానీ, మాసికలు వేసిన లాగూ, బాగా మైలపట్టిన టోపీ, చిరిగిన బూట్లూ చిన్నప్పటి ఖాసిం తయారయ్యాడు వాసు కళ్ళకు. ఆ ఖాసింకూ ఈ ఖాసింకూ ఎంత తేడా వుంది. అసలు తను ఖాసిమే కాడేమో. కాని ఆకంఠం నూరుమందిలో నున్న ఖాసిం కంఠమైనది గుర్తించగలనన్న ధైర్యము వాసు కుంది. ఎంత మధుర కంఠం అది! తానే ఓ సారి ఖాసింతో యిల్లా అన్నాడు. "ఓరే ఖాసిం! నీ కంఠంలో నొవ్వపలుకు తుందిరా! నువ్వే గనుక పాట నేర్చావా, గొప్పవాడ వయి పోతావు. నిజంగా ఖాసిం యిప్పుడు కంఠమాధుర్యానికి మెచ్చి తన కూతుర్నిచ్చి పెళ్ళిచేశాడేమో. లేదా! ఏ లక్కీ పందెమైన కొట్టేశాడేమో? అవును. ఎందుకు అక్కర లేదల్లా ఎవరి నొసట ఎలా రాసుందో యెవరికి తెలుసు. ఆ మిడిల్ స్కూలు వదిలేముందు ఓరోజు హెడ్‌మాష్టరు అనలేదూ "మీలోనించే కొంతమంది జడ్జీలు కావచ్చు, తహశీల్దార్లు కావచ్చు, దేశనాయకులు కావచ్చు, దేశసేవకులు కావచ్చు, అని అప్పుడుఅంతాఒకరిమొహాలొకరుచూసుకొనిముసిముసి నవ్వులు నవ్వుకున్నారు. హెడ్‌మాష్టరు వెళ్ళిపోయాక నేను తాసీల్దార్ అంటే పేచీలుకూడా పడ్డారు. ఖాసిం తన దగ్గరి కొచ్చి "ఓరే వాసు! నీ కేం కావాలిరా తహశీల్దారియా, తాలుక్దారీయా! అని అడిగాడు. వాసు సగర్వముగ ఖాసిం కళ్ళలోకిచూస్తూ అన్నాడు. "మానవసేవ" దేశనాయకులు చేసేపని అదేనని విన్నసంగతి జ్ఞాపకం చేసుకుంటూ "ఛా! నేనైతే హైకోర్టుజడ్జీ నౌతా నచ్చా" అన్నాడు. ఖాసిం

మొహం పైకిజారిన కాప్ సవరించుకొంటూ వాసు అన్నాడు మళ్లీ. "ఖాసిం ఒకవేళ నన్ను పోలీసులు అరెస్టుచేసి నీ దగ్గ రికి తీసుకొస్తారనుకో అప్పుడేం చేస్తావురా ఖాసిం? సీరియస్ మొహంపెట్టి "నిన్నా! నిన్ను కాలాపానికి పంపుతాను" అంటూ కిలకిల నవ్వినాడు కాని ఏం చేస్తాడు.

ఇప్పటి ఆ చిన్నిహృదయాన్నుంచి వెళ్ళిన కోర్కెలు ఫలించాయి. వాసు యిప్పుడు యీ అయ్యారుహోటల్ చేసేది మానవ సేవేమో, ఖాసిం హైకోర్టుజడ్జి అయినాడేమో! ఖాసిం తమ క్లాసులోకల్లా డల్‌గావుండే ఖాసిం హైకోర్టు జడ్జీ అనగానే వాసుకు అప్రయత్నంగా నవ్వొచ్చింది. థర్డు ఫారం ఎగ్జామినేషన్ ఫలితాలు రోజూ తానూ ఖాసిం కలసి రిజల్టు చూడటానికి వెళ్ళటం జ్ఞాపక మొచ్చింది. తోట్టిలో మొద్దు పక్క చింతచెట్టుకింద హిందూస్థానీభయ్యా పగిడీ చుట్టుకొని మొహాన గంధము అక్షింతలు పెట్టుకుని చూచు చున్నాడు. జ్యోతిషం చెబుతూవుంటె అంతకుముందు ఎన్ని సార్లు స్కూలు ఎగ్గొట్టి ఆ చెట్టుక్రిందే ఎన్నో మాజిక్కులు చూపిన ఎన్నడు ఆ భయ్యాను లెక్కచెయ్యని మిత్రద్వయం ఆపూట చెరో పైసాతీసికెళ్ళి వాడిముందు కూర్చున్నారు. తన పుస్తకములో పైసాలు వేయించుకొని పేజీలు తెఱచి వాసుకు గానీ ఖాసింకుగాని రాని హిందీభాష చదువుతూ పెళ్ళాలంటో పిల్లలంటూ అదృష్టమంటూ మొదలెట్టారు. దాంతో ఖాసింకు చలాకెత్తి" అరే భయ్యా అదంతా అలావుణ్ణీ. ముందు మా పరీక్షల సంగతిఏమిా" అన్నాడు. దానికి కాదు ఖాసిం తప్పక

ప్యాసవుతాడని వాసుమాత్రం కొంతశాంతిచెయ్యాలిసివస్తుం దేమోనని యొకరుచెప్పారు. వెంటనే ఖాసిం "ఏడిశావులేరా అంటూ వాసు చెయ్యిపట్టుకులాక్కెళ్లాడు. తీరావెళ్ళిచూస్తే వాసు ప్యాసు, ఖాసిం ఫెయిలు. వాసు మనసుకు చాల కష్టం కలిగింది. తను ఫెయిల్ అయినా అంతచింతిచేవాడుకాదేమో.

" ఏక్ కప్ చాయ్ లావ్ "

అదరిపడి చూశాడు వాసు. ఇందాక ఖాసిం కూరు న్నకుర్చీపైన ఇప్పుడు నల్లటి సేటు కూర్చునివున్నాడు. ఏడీ ఖాసిము. వెళ్లిపోయాడు ఒక్కసారి ఆదుర్దా కలిగింది వాసుకు గబగభా గుమ్మంవఅకు వెళ్ళి వీధియంత కలియచూశాడు. కాని ఖాసింజాడ యెక్కడాలేదు !

ఇందాక ఖాసిముఇక్కడేవున్నాడే,ఇంతలో మాయమై పోయినాడు, ఖాసిమేనా అసలు ఖాసి మచటికిరానే లేదేమో. వట్టి భ్రాంతియేమొ?

వాసు వెనకాల నల్లటిసేటు గర్జించాడు.

" ఏక్ కప్ చాయ్ లావ్. "

(హైదరాబాదు రేడియోవారి అనుమతిని.)

వరూధినీ ప్రవరాఖ్యులు

— జమ్మలమడక సూర్యప్రకాశరావు

౧

ఒకరు భాషావిషయమున తగవులాడుదురు. మరొకరు వ్యాకరణాలంకారములకు బలిపీఠములు నిలుపుదురు. వేరొకరు క్రొత్తపాతల పేర్లకై గేలివడుదురు. అయ్యో! తెలుగు సాహిత్యజీవన మింత రసదరిద్రాణమైన దేమి!

కావ్యజగత్తు లౌకికాలౌకికము. కాదసలు జగత్తే లౌకికాలౌకికపు సమ్మేళనాప్తి. ఈ యర్థవాదమును పురస్కరించుకొని పెద్దనగారు రచించిన సృష్టి సంకలన వ్యాఖ్యామే స్వారోచిష మనుచరిత్రము. సర్వసృష్టి నిట్లు విశిష్టాద్వైతమున సూత్రించినాఁడు గనుకనే అష్టదిగ్గజముల దొట్టి 'యాంధ్ర కవితా పితామహు'డైనాఁడు. కృష్ణరాయ సామ్రాట్టుచేతుల లేని మాన్యత లందినాఁడు. ఉదాహరణమా?

"మనుచరిత్రం బందుకొను వేళ పురమేఁగ
పల్లకి తనచేతఁ బట్టియెత్తె"

ఓహో! ఇట్టి కవిసార్వభౌముల నేనాటనైన వినగలమా? వారిని తమవారినిగా చెప్పుకోగల్గిన తెలుగు లెంత పునీతులు!

౨

తెరదీయుచునే పెద్దనగారు భూమ్యాకాశములకు పెండ్లి పందిరి గప్పినారు. "వప్రస్థలీచుంబితాంబరములు", "ధవళ

సుధా ప్రభాధవళితప్రాలేయ రుక్మండలీ హారిణ'' మట. దివమునకే వంకలు దిద్దు నాపురము నిజముగా ''మహీకంఠ హారతలళిస్ఫూర్తి'' గలదే.

ఆ కర్మభూమి నిషాయంతయు నొక సీసమాలికలో వర్ణితమైనది. ''మొసటి వేల్పు'', ''భార్గవుడు'', ''ఆది భిక్షువు,'' ''కాసెకొంగు'' వీనికి మించి సందర్భశుద్ధి గల శబ్దము లింక లేవేమొ. వానిలో క్రమముగా జ్ఞానప్రాథమికతలోని పేరు పెద్దఱికము, తండ్రినిబట్టి యాగర్భక్షత్రియ కుల మాత్సర్యమును మూటగట్టుకొన్న భీషణపరశుధారి, ఈశ్వరుని నిత్యభిక్షుత, పరాక్షేపవిలాస సహజతలు సుస్ఫోరకములు. ఇంతకు ''అచట బుట్టిన చిగురుఁ గొమ్మైన చేవ'' యట. ఎంత చక్కని కుంచెగీత.

పురవర్ణన మిట్లు ముక్తసరిగా మూడు పద్యాలలో ముగిసినది. సూరనగారివలె నాలుగు వర్ణములను నాలుగు పద్యాలతోనని మఱియొక పద్యముతో ఆడిన యబద్ధమునకు గిలాబుచేయుటకు తాతగారు బహుప్రౌఢులు. కృష్ణరాయని-కాదు—లౌకికుని బహువ్యాసృతి విస్మరింపలేను. అతని యర్థ చమత్కృతియు నాస్తికుని నమ్మించన ట్లుండియు నమ్మించితీరు ఆస్తిక తర్కమువోలె నుండును.

ఇక కథానాయకుఁడో ''ఆ పురి బాయకుండు''వాఁడు. ఇది యెంత సార్థకమో! కావ్యమంతయు దీని చిలువలు పలవలే. ఆద్యంతములలో నాతని సౌందర్యవర్ణనలుంచి మధ్య నాతని శేముషీ నైష్ఠికతలు బొదివినాఁడు. మను పద్యములో

వాని చక్కఁదనము "పూచిన సంపెంగపొలుపు మధుకరాంగనలకు ఘోలె" కామినులకు భోగబాహ్యమును కథాబీజమును స్థూలీకరించి చూపినాఁడు. అట్లని యాతఁడు విరాగి కాఁడు. పాలకడలిఁబోని సంతుకాపురము. ఈడుజోడు కలిగి ప్రియురాలు ననుకూలవతియగు భార్య. పోసి సంసారపు చిక్కులలో నలిగి విషయపరాఙ్ముఖుఁడైనాఁడన "దేవియుం దేవరవోలెనుండె" తలిదండ్రులు ఋలుదీర్చుచున్నారు. పెద్దనగారింకను దూరమాలోచించినారు. సోమిదమ్మ యలోకసౌందర్య మాతని యనన్యాపేక్షకు కారణము కాఁగూడదా? యని ఇట్లని తత్సౌందర్యమునే పేర్కొనలేదు. ఇంతకు శ్రోత్రియ కుటుంబపు టాకుపచులయు సోమిదమ్మలయు సౌందర్య వర్ణన మాయనకు మాత్రము శోభదాయక మనిపించునా? ధర్మసభాయోగ్యమగునా?

కథావిస్తృతికై యభివర్ణితమైన నాయకుని యతిథిసేవాతత్పరతలో తితీక్షాస్ఫోరకముగ ముక్త పదగ్రస్తముంచు టుచితమే. నాయకుని యీ గుణబీజము సిద్ధసపర్య, పాదలేపసిద్ధిలో స్ఫుటితమగును. మాటకారిగాని వానిచే "ఓ చతురాస్యవంశకలశోదధి పూర్ణశశాంక," యనిపించుకొన్నవాఁ డెంత చతురవాక్కొ, వినయధురీణుఁడు కావలయును. పాదలేప మలముకొన్న భూమిసురుఁడు "తుహినభూధరశృంగశ్యామల కోమల కాననహేమాఢ్య దరీఝరీనిరీక్షాపేక్ష నరిగె"నట. ఇదేమి? ఇతఁడు వేదజడుఁడు కాఁడా? వీలైనంత పుణ్యమును మూటగట్టుకొననే కాశీరామేశ్వరములు

లకో బోక హిమవన్నగ సౌందర్యమనుభవింప రెక్కలుగట్టు కొన్న యీతఁడెంత రసస్నిగ్ధుఁడో, ఎంతసాహసో దారుఁడో! తెలుగు యువకు లపహాస్యముల కనుగొను ప్రవరాఖ్యుఁ డీతఁడు కాఁడు. అతఁడు వారి యంతరాత్మలలో నాడు నీరస ప్రవరుఁడు.

ప్రవరుని "పవమాన మానస తిరస్కారిత్వరా హంకృతి' తోడి హిమవన్నగ యాత్రయంతయు "అటసని" యనుటతో దీరినది. అటుపై నాతఁ డరసిన

"..................అంబరచుంబి శిరస్సరఝ్ఝరీ
పటల ముహుర్ముహుర్లుఠదభంగ తరంగ మృదంగ నిస్స్వన
స్ఫుటనటనానురూప పరిఫుల్ల కలాపకలాపి జాలముఙ్
కటకచరత్కరేణు కరకంపిత సాలము శీతశైలముఙ్"

" ఉల్లల దలకా జలకణ
పల్లవిత కదంబ ముకుళ పరిమళ లహరీ
హల్లోహల మదబంభర
మల్లధ్వను లెసగ వినరె మరు దంకురముల్".

అనుటలో భాషానభిజ్ఞుఁడు సైత మనుభవింపదగు మనోహర శబ్దధ్వని యున్నది.

" నిడుద పెన్నెఱిగుంపు జడగట్ట
పగరు మున్మనుమ్మండు తపము గైకొనినచోటు..."

అన్న పద్యములో సిద్ధునిరాక, ప్రవరునియాత్ర, వరూథినీ వరణము, బ్రాహ్మణుని తిరస్కృతి, గంధర్వ విర

హము, స్వారోచి జననము వఱకు నగు మనుచరిత్ర కథ యంతయు క్రమముగా సూచితమేమో ?

ఆయా హిమవన్నగ విశేషముల నూహించుచు

“ పసుపు నిగ్గులు దేఱు పాఁప జన్నిద మొప్పఁ
ప్రమథాధిపతి యింటి పట్టెఱింగె
శచి కీల గఱపుచుఁ జదలేటి సురరాజు
జలకేళి సవరించు చెలువెఱింగె” ననుకొను ప్రవరునిలో

నిజముగ రసికప్రవరుని గాంతుము. ఇట్లరయుచుండగనే ప్రొద్దెక్కినది. ఆకలి బాధతో ఇంటిపై మనసుపోయినది. గృహగమనాభిలాషియై మధ్యాహ్నము నిట్లు నిరూపించును.

‘ నలినీబాంధవ భానుతప్త రవికాంతస్యందినీహారకం
దళ చూత్కార పరంపరల్ పయిపయిన్ మధ్యాహ్నముం
దెల్పెడిన్’

ఇచట భానుని నలినీ బాంధవత్వము రవికాంతకు తాపకారణ గడుసుభావములో తన రాకకై యుత్కంఠతతో నుండు “ కూరిమి సోమిదమ్మ” ను జ్ఞప్తి కెలయించుచున్నాడు. నోట వ్రేలిడిన కరువలేని గోల యనుకొన్నాము. అబ్బొ! ఎంత లౌకికుడు. ఇట్లనుకొని గ్రమ్మఱు వేళ పాద లేపము నీహార వారి “ బెరసి ”నదనుటలో కరకు మంచు నీటిక్షాళన విధియు, “కరఁగిపోవుట యెఱుఁగఁడద్దరణీసురుఁ” డనుటలో ఉత్సాహాధఃకరణమును చక్కగా సూచితములు.)

ఇట్లౌషధహీనుఁడై భయసంభ్రమితుఁడైన ప్రవరుని నోట నొక యర్థాంతరన్యాసమును చిలికి పెద్దనగారా పాత్రే

తత్త్వమునకు చికిలి చేసినారు. శ్రోత్రియులు "బుద్ధి జాడ్య జనితోన్మాదు"లట. అట్టివాఁడు తనకు తా నట్లనుకొనునా? "శ్రోత్రియు"లని సాధారణీకరించుటచే నది మనోవిహ్వాల లక్షణ (స్త్రీలక్షణము?) మగు స్వోపాలంభనమునుగాదు. అట్లు బుద్ధిజాడ్యజనితోన్మాదియే యైన "మాయా ద్వారకావంతి కాశికురుక్షేత్ర గయా ప్రయాగముల కే కాలుద్రు మ్వోడివాఁడు. అట్లుగాక ప్రకృతి సౌందర్యపిపాసి కావుననే "తుహినభూధర శృంగశ్యామల కోమలకానన హేమాధ్యాసీరఝరీ నిరీక్షా పేక్ష" నిట్లురు దెంచెను. కాని ఇప్పట్టున నా తుహినభూ ధర మే "ఉద్దండగండక వేదండ వరాహ రిపుఖడ్గ వ్యాఘ్ర" మగు మంచుకొండయై యున్నది. కాగా, నా యద్రాం తరవ్యాసము కృష్ణరాయాది యనైదికుల పరిహాసస్మిత పరి భూతి కొక సాధన మాత్రమే యగును.

ఒకముని కరుణా విశేషముచే నింతవరకు వచ్చినాఁడు. మఱల ప్రభావాన్వితులగు మునుల కరుణచేతనే నిత్యకృత్య ములకు జెడకుండ యింటికి జేరగల్గును. ఈ భావములో ప్రవృత్తుఁడైన ప్రవరుఁడు గంధర్వయక్షగాన ఘూర్ణితమగు కోనను మునియాశ్రమ మని భ్రమించినాఁడు. ఇట "తహ తహ" యనుటచే బుద్ధి వివేచనములేని ఆతురతయే సూచి తము. అందును ఆ దేవగానము సామగాన సోదరమేమొ. అందుచే నాతని యూహ బలవత్కారణమగును. ఎట్లయినను నీటఁగొట్టుకొని పోవువాఁడు కాలసర్పమునైనను తరణోపాయ ముగ గ్రహించునుగాదా.

అతఁడా కోనచేరి అందొక గారుడోత్కీర్ణమగు భవనము నరసి డాయబోవుచో:

"మృగమద సౌరభ విభవ
ద్విగుణిత ఘన సారసాంద్ర పటీగంధ
స్థగితేతర పరిమళమై
మగువ పొలుపు దెలుపు నొక్క మారుతమొలసెన్"

ద్రుతముతో నంతమగు నా పద్యపు నడకయు రసికుని కవ్వింపనలసి మలసి సాగి యాగి మైదూలు పిల్లగాలి తునకల వలె లేదా!

అచటి "యావాత పరంపరా పరిమళ వ్యాపార లీల" అతని మున్న్యాశ్రమ భ్రాంతిని సడలించి ఇచ్చోటు జనాన్వితమనువరకు దెచ్చినది. పైనాతఁ డరసి దృశ్యములో చక్కని క్రమమున్నది. ముందాతని కన్నులు మిఱుమిట్లుగొన్న నొక విద్యుల్లతా విగ్రహముచే కనులు నులుము కొని మరల చూచినది క్రమముగ శత పత్రేక్షణములు, చంచరీక చికురములు, చక్రస్తనములు, నతనాభియు గల "ఒకానొక మరున్నారీశిరోరత్నమును. ముక్కు మూసికొని మూలగూర్చొను ఆహితాగ్నికిన్ని స్త్రీవిశేషణముల నరయ వలసిన యావశ్యకమేమి? ఇతఁడు వేదజడుఁడా? కృతక నైష్ఠికుఁడా? ఇంత యరసిన యతనిలో నిలిచిన భావమేమి? "ఎవరో యొకానొక మరున్నారీశిరోరత్న" మని. ఇట్టి సవికార నిర్వికార శబల సుందరతయేగదా రసికత. ఇట్టి పరా సౌందర్య మగ్న మానసులకే యధీతము.

పై దంతయు వరూధిని యాంగిక సౌందర్యము. దాని నిరుపమించుచు నాపె ధారణాసనవిధి, వీణా వాదన రతిపార వశ్య విభ్రమములు. ఇప్పటి వరూధినీ ప్రవరుల స్థితిలో సరిగ స్వర్గమర్త్య ప్రాతినిధ్యములున్నవి. ఇక నాపెయో "మది లోన కోరికల్ గుబ్బటిలంగజూచె నలకూబరసన్నిభు నద్ధరా మరున్" సర్వసంతృప్తిగా కుడిచి కూర్చున్న వరూధిని కాతని జూచుతోడనే అప్సరోంగనానుభవ్యమగు నలకూబరత్వ మాదకు వచ్చినది. చలించినది. సిగ్గున చాటుచేరి "అవి స్మృత మీనాంకానల సూచక ధూమాంకురములువోలె పులక లంకురింప మోమంతయు కన్నులు జేసికొని మరి మరి జూచినది. ఇట్టి వికారముతో నిప్పుడాతని సౌందర్య మాత్మ గతముగ వర్ణించుకొన్నది. ఈ రామాయణమున కంతయు పది పద్యములు పట్టినవి. ఈ హంగామా యంతయుజూచి విభ్రాంతుడై ప్రవరుడు తన్నెఱిగించుకొనుటయే కర్జ మను కొని పలుకరించినాడు "ఎవ్వతె వీవు భీతహరిణేక్షణ!" దీనిలో యెవరో విప్రునిజూడ నేటికింత సంభ్రమమన్న యనునయము. అంతటి చంచలేక్షణములు సులక్షణము గాదన్న వితర్కము. ఉపమానోపమేయగతమగు సౌందర్య సంస్ఫురణ లున్నవి. తన కథయంతయు మూడు ముక్కలలో ముగించి "పురంబుజేర నిం కెవ్విధిగాంతు తెల్పగదవే తెరు వెద్ది శుభంబు నీకగు"నని ఆశీస్సుద్ధిగా వైదికత్వమును ప్రస్ఫు టించుకొనినాడు. దీనికి బదులు సెలవివాఱు నవ్వు. నర్మ గర్భోక్తులు, స్వోత్కర్ష ము. సాభిప్రాయాతిథ్య ప్రలోభనము. అవసరములేని యంగలార్పులు దీనికంతకు పరిహారమొక్కటే

పలుకు "అండజయాన నీవొసగునట్టి సపర్యలు మాకునచ్చె" నని అండజయాన యనుటలో లేనిపోని సపర్యల కటుసిటు నేల తడబడుచువన్న రసికభావముతో రాబోవు ననర్థమన కాన బెట్టినాడు "ఇప్పు డేను రాకుండ యొకండువచ్చి మతి యొంచునె భక్తియ చాలు" నన్న బ్రాహ్మణవాక్యంలో మాయాప్రవరుని సూచించు భావి కథావ్యంగ్య మెంతె యో యున్నది. ఇట్లని యామెను మానినిగా నెఱింగించి దేవయో నిజ మహిమాన్వితగావున తల్లిగా సంబోధించి "ప్రజలక నను గూర్పు"మని ప్రార్థించి నేతి ముద్దవలె చల్లగ దిగజారి నాడు. వైదికుని యీ స్వస్వభావ ప్రౌఢ సిరతిలో తమ కముతో గూడిన వరూథిని సెలవివాఱునవ్వు పేదవడి లేత నవ్వైనది. నిక్కము దాప లేక హృదయము నగ్న మొనరించి నది. ప్రవరుడు "యిట్లు వలుక వరుస" కాదనును. అనగా నక్రమమనియా లేక వైదికుడను గాన మేలమాడుచున్నా" వన్న పరిహారవాక్యమా? "యజ్ఞాదులకు ఫలము స్వర్గసౌఖ్యమే గాదా? నీకిపుడు సశరీరస్వర్గసుఖమే సమకొని యుండగా "నశనాయాసాదులచే నాత్మనలచుట కుశలత కా"దని యా స్వర్గసౌఖ్యమును వాక్కులలో చిలికి నోరూరింపజూచినది వరూథిని. ఎంత సహేతుకానునయము! దీనికి ప్రవరు డేమనునో చూతము. "నీ వన్నయర్థమెల్ల నిజము కాముకు డైనవానికి, నకాముకు డిది గణించునె జలజాక్షి" యన్ని నే నకాముడ నని సూటిగా జెప్పుటగూడ నిర్లిప్తతకు భంగమే కాబోలును. పైగా జలజాక్షి యట. ఎంతటి యాత్మనిష! ఎంత సౌందర్య దర్శనోపజ్ఞ!

వరూధి నింకను అనునయాశ వీడ లేదు. "కుంభగత ప్రదీప కళికా శ్రీ దోప నెందెందు బోకెందే నింద్రియముల్ సుఖంబుగను నా యుంపే పరబ్రహ్మము". దీనికి తార్కాణము "ఆనందో బ్రహ్మ" యటన్న శృతివాక్యు — ఈ విధముగ యోగ స్థితిని ధ్వనించు మాటలలో భౌతికసంసక్తిని నిలబెట్టుచున్నది. సచ్చిదాత్మ సంసక్తియే అజ్ఞానావస్థలోని భౌతిక సంసక్తికి హేతువన్న సత్యమును పురస్కరించుకొన్న వాద మిది. ఆత్మ నిష్ఠలేని పాండిత్య మెంత వంచకము! అందుకే ప్రవరుడు "సిగ్గును వెగటును బాడమ నిస్పృహాత దెలుపు నొక్క చెలు నవ్వు" నవ్వినాడు. "ఈ పాండిత్యము నీకుదక్క మఱియెందే గంటిమే" యని వ్యాజస్తుతి గావించినాడు. అతడలాకి కుడేయుగుచో పై వాదమును పూర్వపక్షమొనరించి వాదింప గావంచా బిగించువాడేమో. కాని తుది తనొక్కడబలచు తత్తఱములో నయ్యమరకాంత జేయు "మెఱిగిన త" ప్పని యెఱుగును. అట్టిచో మాటలు పెంచుట నాగకన్యకు నాగ స్వరము బట్టు టగును. అట్లని తెగజెప్పినాడు "నాకరణుల్ దర్శులు నగ్నులుం బ్రియములైనట్లన్యముల్ గా వొడల్ తిరమే చెప్పెద మిట్టి తుచ్ఛసుఖముల్ మీసాలపై దేనియల్." బాహుగ్య వర్ధమగుటకై చక్కని జాతీయముకూడ వాడినాడు.

వరూధినికి వాగ్బంధన మైనది. మోహాంధతలో బేలయై వైపాటున :

ప్రాంచద్భూషణ బాహుమూలరుచితో పాలిండ్లు పొంగార బై యంచుల్ మోవగ గౌగిలించి యధరం బాసింప హా శ్రీహరీ

యంచున్బ్రాహ్మణుఁడోరమోమిడితదీయాంసద్వయంబంటిపా
ర్శ్వంబుం ద్రోచెఁ గలంచునే సతులమాయల్ ధీరచిత్తంబులన్.

ప్రవరున కీవరకున్న భూసురత్వ విప్రత్వముల దొట్టి పెద్దనగారు తద్బ్రాహ్మణత్వము నీ పద్యములో స్థాపించినారు. ఓరమోమిడి జాగరూకతతో నంసద్వయంబంటి పార్శ్వంబుం ద్రోయుటలోని వైదిక నైశిష్ట్య మా పెద్దన ప్రవరాఖ్యులకే తెలిసినది. కాని "కలంచునే సతులమాయల్ ధీరచిత్తంబులన్" అని ప్రవరపక్షపాతియై దిద్దిన అర్థాంతరన్యాస సందర్భమున పెద్దనగారొక క్లిష్టతలో బడినారు. సతులన పతివ్రతలగుటచే "సతుల మాయ"లనుటలో నర్థగతమగు లగింపు కనపడ లేదు. అటు జగస్స్రష్టృడైన స్వారోచిషమనువు పితామహి 'యసతి' యనుటకును నోరురాలేదు. అనన్య భోగలోకమగు నిర్జర లోకపు వధూరత్నమునకు కామన వ్యాపార మనుచితమును గాదు. కామించినదియు దేవప్రీతికై నిత్యబుభుక్షువగు తరు ణాగ్నిహోత్రిని. పొందినదియు తద్రూపభాసత నే. కాన ఎటు జూచినను వరూధిని యసతీత్వమునకు కారణమును గనపడ లేదు. అట్లని కావ్యార్థమును జెఱచు 'అసతి' శబ్దముకంటె స్త్రీ సామాన్యార్థకమగు సతి శబ్దమునే ప్రయోగించినారు ఈ ప్రయోగము మరికొన్నిచోట్లగూడ నున్నది. దీనికి పరిపుష్టిగ 'ధీర' శబ్దమునుగూడ సామాన్యార్థకముగనే వాడినారు. కాదన్న అష్టదిగ్గజములకు మరో దారిచూపినారు. కార్యేషు దాసీత్యాది షట్కర్మయుక్త గదా సతి. మాయ వేశ్యాధర్మ మనుకొన్నచో స్వపతి విషయమున సతికి సమ్మోహాన (మాయ) మనుష్ఠేయమేగాదా. కాన తాత్వికదృష్ట్యా మాయా

స్వరూపిణులుగా చెప్పబడిన స్త్రీల పక్షమున తత్త్వార్థబోధక మగు నర్థాంతరన్యాసము లో "సతుల మాయ"లనుటలో అనౌచిత్యము లేదని.

త్రోపువడియు నేమియు నన లేకపోయినది. నిర్దరవధూటి. కోపావిష్కృతినంతను సేకరించుకొని "కృపారహితాత్మక" యనగల్గినది. తన్నఖాంకురము సోకినందుకుగాను వేదన నెప మున కలస్వనముతో నేడ్చినది. ఎంత లలిత ప్రకృతియో!

"బాడబులు", "మేనకచుట్టటికము", "ననుపు కాడు" "అహల్యా జారుడు," "ఇనుప కచ్చడాల్ గట్టుకొన్న మునిముచ్చులు" మొదలగు కోపకషాయిత పద ములతో నింకనేవో ప్రాతగాథలు త్రవ్వుచున్న వరూథినికేమియు ననక ప్రవరుడు ముందు 'అవ్వనజగంధిమేని జవ్వాది పస కదంబించు నొడలు గడిగికొనెనట. అటుపైవార్చి, అగ్ని దేవుని "స్వాహావధూవల్లభు"నిగాను "హవ్యవాహను"నిగాను ప్రార్థించి తత్ప్రసాదమున ఆత్మసతీ వాల్లభ్యమును నిరంతర విశ్వయజ్ఞమున నిత్యసవిత్రిహావ్యత్వ మొందును.

3

ఈ క్రింద నన్యాపదేశముగ నభివర్ణితమైన తదేక చిత్త యగు వరూథిని కరుణా విలవృత్త మెంత హృదయంగమము.

ఏ విహంగముగన్న నెలుగించుచును సారె
కునుస్సైకతంబులగూడ దారు
దారి కన్గొని యది తనజోడుగాగన్న
మెడయెత్తి కలయంగ మింట నరయు

నరసి కన్నీటితో మరలి తామరయొక్కి
వదన మెండగ సరోవారి నద్దు
నద్ది త్రావగ సైపకట్టిట్లు గన్గొని
ప్రతిబింబ మీక్షించి భ్రమసియలుక
నుఱికి యెఱకలుదడియ వేఱొక్కతమ్మి
కరుగు నరిగి రవంబుతో దిరుగు తేంట్ల
బాఁపుచు ముక్కున మఱియును బోవు వెదక
సంజ బ్రియు బాసి వగనొక్క చక్రవాకి.

మఱీ క్రింది పరిదేవనమో ?

"ఎంతతపంబుజేసి జనియించినవారొకొ మర్త్య భామినుల్
కాంతు డవజ్ఞ చేసినను కాయమువాయుదురే నమర్త్యనై
చింతలవంతలం జిఱికి సిగ్గఱితిన్ స్మృతిలేనినాదు చె
ల్వింతయు శూన్యగేహమున కెత్తిన దీపికయయ్యె నక్కటా."

తనయమర్త్యనే రోయు త్యాగము, స్మృతికై దుర పిల్లు మానము— ఇవన్నియు" పూతపసిండివంటి వలపుం బచరించు "నా జాతికే లేత. వీనియాత్మశుద్ధికి సూచనగ "చనుగప్పు తొలగ వాసనగాలి కెమరేగు……… తనువు: దోఱఁగంగఁదలఁచి యవ్వనరుహాక్షి."

తొలుత స్వోత్కర్షముతో ప్రారంభమైన నిర్జరవధూటి కనుఁవేదుఱు తిరస్కృతమై, విరహావమానాగ్నులచే సాకల్యముగ తపితముకాగా నచ్ఛమై నిలచిన యిప్పటివలపే జగత్త్రల్యాళి సంధాయకమగు మను సంభవమునకు యోగ్యము. కాని, దానికై బ్రహ్మానందాధిరాజ్యపదస్థుఁ డగు ప్రవరునికి

సంకెళ్ళిడి దిగలాగుట స్వరసతకాదు. ఇచ్చటి ప్రవరునిలో నూహ్యాము, సర్వాదర్శకము, సాక్షిభూతమునగు జగత్ప్రవ రత్వమే యుద్దేశింపబడినది. నీనికి వినియోగము ప్రకృతి పురు షుని బ్రహ్మభాసతలో సక్త మగుచున్నదను సృష్టి సూత్ర ప్రతిపాదనము. అట్టి ప్రవరత్వమునకై యొక వియచ్చర ప్రవరునిచే నీర్గావులు గట్టించెను. వరూధినిలో నిలచినది సర్వథా బ్రాహ్మతేజ సముజ్జ్వలమగు ప్రవరత్వమేకాగా తరు వాతి ప్రవరుఁడు వ్యంజన మాత్రుడగుచున్నాడు ఇప్పట్ల గంధర్వుని రాసిక్యత శంక్యమేకాదు కావ్యరసమునకు భంగ కరముగూడ నని పండితుల యాపత్తి. కావచ్చును. కాని యది తప్పరానిది. గంధర్వుఁడు వరూధినిని వరించె ననుటలో నట్టి యాపత్తికి తావులేదు. కానియది స్వయం తేజుఁడగు స్వారోచిషమను సంభవమునకు దారితీయదు. ఇటు ప్రవరుని ప్రవృత్తునొనర్చుటచే మనువు మహాసత్వత చేకూరకపోగా పాత్రౌచితియు కావ్యార్థమును వికలములగును. కాదని ప్రవర రూప భాసితచే గంధర్వుఁడు వరూధినిని వరించెననుటలో అర్థవాద ప్రయోజకమగు రసాభాసమున్నది. కారణ శరీరు లగు దేవతల ప్రవృత్తు లత్యంతము మానవ నియతిలో కుంచింపరానివి. అందును నర్థవాదములగు పురాణమూలక మగుటచే ప్రాకృతికతలో దీనికట్టి సంకుచితత్వమేర్పడినది. కొండ నదములో జూపుచో నిట్టి యాభాస మేర్పడును. నిజ మున కేదో విధముగ నట్టి యాభాసమేకాదా కావ్యమునకేమి, కళలకేమి సర్వసృష్టికే హేతువగుచున్నది.

పిచ్చికగూడు

— శ్రీశాగి నారాయణమూర్తి

ప్రొద్దున్నే కాఫీపుచ్చుకొని బయలుదేరాను. స్నేహితుల్ని వెంబడివేసుకొని, వీధివీధీ, సందుసందూ కాళ్ళు కదుములు కట్టేటట్లు తిరిగి, సాయంత్రమయ్యేసరికి యుద్ధంలో విజయం చూరగొనివచ్చిన యోధుడిలాగా, వికసించిన మొహంతో, ఇల్లు చేరుకున్నాను.

ఓరగా వేసిన కిటికీ తలుపుల సందులోనుంచి పిచ్చిక పిల్లలాగా నాకోసమై యెదురు చూస్తున్నది పద్మం. నేను రావటం అడుగులచప్పుడుపట్టి గ్రహించి వుంటుంది. వెంటనే వీధిగుమ్మందగ్గరకు ఉరికింది. నేను గుమ్మంలో కాలుపెట్టడం లోగొళ్ళెం విడిపోవటం ఒక్కసారిగా జరిగినాయి. నుదుటిమీదనుంచి చెంపలమీదికి జారిపోతున్న చెమటను కుడిచేతి చూపుడువేలుతో తుడుచుకుంటూ, చిన్న నిట్టూర్పుతో ఇంట్లో ప్రవేశించాను. కోటు 'హాంగర్'కు తగిలించి, చెప్పులు విప్పి, దొడ్లోకి వెళ్ళి కాళ్ళుచేతులు కడుక్కొని పడక్కుర్చీలో కూలబడ్డాను. కాళ్లను పడక్కుర్చీ చేతులమీద నిగిడ్చి, నిమీలిత నేత్రుణ్ణయి రేగిపోయిన క్రాపును కుడిచేతి వేళ్ళతో సర్దుకుంటూ "చల్లటి మంచినీళ్ళు కావా"లన్నాను, పద్మంవైపు తిరగకుండానే. నేను పురమాయింపకముందే ఆపనిమీదే వంటింట్లోకి పోతున్న పద్మం తొందరగా కంచు గ్లాసుతో మంచినీళ్లు తీసుకొని హాజరైంది. మంచినీళ్లగ్లాసు

అందించి ఆ చల్లటి చేతులు పాదాలమీద వేసింది. ప్రాణాలు లేచివచ్చినాయి. ఆ క్షణానికి కాళ్ళ నెప్పులన్నీ మటుమాయమై పోయినాయనిపించింది. పద్మం పాదాలువత్తుతూనే మధ్యాహ్నం భోజనం యెక్కడ చేశారని అడిగింది.

భోజనం చేశానని చెప్పాలో చేయలేదని చెప్పాలో తోచలేదు. చేయలేదని చెప్తే ఆ వేడి గుండెల పిల్లమనసు నొచ్చుకుంటుందేమోనని మౌనం వహించాను.

"స్నేహితులింట్లో భోజనం చేశారా?—భోజనానికి రానివారు రానని చెప్పకూడదూ."

'కొంపతీసి నా కోసమై భోజనంచేయకుండా కని పెట్టుకొని కూర్చోలేదుకదా!' అన్నాను. ఆదుర్దాతో పద్మం ముఖం తేరిపారచూస్తూ, భోజనం చెయ్యలేదనే భావం వ్యక్తపరుప దలచుకొన్న మూకాభినయంతో జవాబు చెప్ప కుండానే, తలకాయ వంచుకొని పాదాలు వత్తుతూ నిల్చున్నది. కాని ఆ బిగించిన పెద్దవుల్ని తోసుకవస్తున్న చిరునవ్వు— ఆ నిర్మలమైన కళ్ళల్లో తేరుకుంటున్న ఛాయలు— రూఢిగా భోజనం చేసిందనే చెప్పటంవల్ల ఆ ప్రసంగం చటుక్కున మార్చేశాను.

పద్మానికి ఆశాభంగం కలిగింది.

నాలోనేను నవ్వుకుంటూ— ఇల్లు కుదిరిందన్నాను.

పద్మం మాట్లాడలేదు.

అద్దె యెనిమిది రూపాయలు—నీళ్ళకు రూపాయి

న్నర — దీపాలకు రెంటుంబావులా — అవుతుంది అంటూ సాగించాను.

'బాబో 12 రూపాయలుదాకా ఇంటి అద్దెకే పెట్టితే మీ కొచ్చే 40 రూపాయలతో యేం కాపరం చేస్తామండి, అన్నది పద్మం. నేను చాలా తెలివి తక్కువపని చేశానని అర్థమిచ్చే చూపులతో నా వంకచూస్తూ.

యేం చేస్తాం మరి అద్దెకొంపల కరువురోజులివి. ఏ చెట్టు కిందన్నా గుడిసెవేసుకొని కాలం వెళ్ళబుచ్చుకునే అదృష్టం మన మొహాన రాయలేదు. భగవంతుడు — మనల్ని ఆ తెగలో పుట్టించలేదు.

'యెన్ని గదులున్నాయి?'

'యెన్ని గదులు కావాలి ఒక జంటకు. రెండుగదు లున్నాయి. ఒకటి చిన్నది. ఒకటి పెద్దది—ముందు చిన్న వరండా వున్నది. నీళ్ళకు వేరే ప్రత్యేకం కొళ్ళాయి (నల్లా) లేక పోయినా ఆట్టే వత్తిడి వుండదు — సదుపాయాలన్నీ చూసే తీసుకొన్నాను.'

'అయితే ఆ యిల్లు తీసుకోటం ఖాయమేనా?'

'అంటె.........! బజానాకూడా యిచ్చివచ్చాను!

"ఏమొచ్చిందండి అంత తొందర? మొన్న మన యింటి ప్రక్కన మంగమ్మగారు చెబుతుండే సీతన్నగారి తోటలో ఆరు రూపాయల భాగాలు అద్దెకున్నాయని"

"ఏం తొందర వచ్చిందంటే తొందరకాకపోతే మరే మిటి? ఇంకా 10 రోజుల్లో యీ ఇల్లు ఖాళీచేయాలాయె—

నేనీ అద్దెకొంపలకోసం యెక్కడ వేటాడుతూ కూర్చోను—నీకు వారానికి ఒకరోజు—ఆదివారం. తీరిక దొరుకుతుంది. ఆ ఆదివారం కాస్తా జారిపోయిందంటే మళ్లీ వారందాకా బయటి ప్రపంచకం చూసేటందుకు వీలుండదు—ఇప్పుడు తీసుకొన్న యీ యిల్లు మా ఆఫీసుకు దగ్గరకూడా వున్నది''

" అదీ......! ఇంకేం...ఇరవై నాలుగు గంటలూ మీరు ఆఫీసులోనే వుండవచ్చు—అయితే యెప్పుడు కొత్త యింట్లో ప్రవేశించటం?''

' దానికి పంచాంగం చూడాలాయేమిటి?—వచ్చే ఆదివారం!'

" ఆదివారంకంటే మంచిరోజు మా మతంలో లేదు. అది పర్వదినం.''

'మీమతం యేమిటి? కొత్తగా మతంపుచ్చుకున్నారా యేమిటి!' అంది పద్మం—కుడికాలి బొటన వ్రేలు మెటికె విరుస్తూ పొరలివచ్చే నవ్వును బిగించిన పెదవులతో అదిమి పెట్టుతూ.

' అవును బానిస మతం అన్నాను. నిమీలిత నేత్రుణ్ణాయి.

*　　*　　*

ఆదివారంనాడు తెల్లవారుఝామునే లేచి వంటచేసింది పద్మం. భోజనముచేసి పెందరాడే, నూతన వసతి గృహప్రవేశానికి సకుటుంబంగా సన్నిద్ధుడనైనాను. రెండెడ్ల బండిలో సామానంతా సర్దాము. ఒంటెద్దు పెట్టె బండిలో

ఊరగాయల జాడీలూ, గాజుసామానూ పెట్టుకుని కూర్చుంది పద్మం. రెండెడ్లబండి పక్కనే, లాంతరు పట్టుకుని, సామాను పడిపోకుండా చూస్తు నడుస్తున్నాను.

"అక్కడే! ఆ లాంతరుస్థంభం దగ్గరే... ఆపుకో బండి" నంటూ బండివాడిని హెచ్చరిస్తుంటే, పద్మవిని, పెట్టెబండీ, పరదాలతొలగించి తొంగిచూసింది. ఆ ప్రాంతాల యెక్కడా మేము వుండేందుకు నివాస యోగ్యమైన చిన్న ఇళ్ళువున్నట్లు కనిపించలేదు. బండి ఆగింది. పద్మం దిగింది. 'యెక్కడ ఇల్లు' అని అడిగింది.

'అదేం, ఎదురుగుండా కనబడటల్లేదు' అన్నాను.

"ఆ మేడా!" అంటూ అనుమానంతో నన్ను చూసింది.

'వెళ్ళుతున్నాంగా' అంటూ ఇంటివైపు నడకసాగించాను. నన్నంటి పద్మం అడుగు వేస్తున్నది!

ఆ ఇల్లు పూర్వకాలపు మట్టిమేడ.

మేడమట్టుకు చాలా పెద్దది. అందులో పది కాపురాలున్నాయి. కాని నేను తీసుకొన్న భాగం మట్టుకు తక్కిన వాటితో సంబంధం లేనిది.

వీధిగుమ్మందాటి చీకటితో నిండిన యిరుకువున్న సందులోంచి కొంతదూరం పోవాలి, నే తీసుకొన్న భాగం చేరేందుకు. నాలగడుగులు వేసి యెక్కడికీ పోవటం అంది పద్మం. 'భూతగృహం కాదులే అన్నాను. ఆ చీకట్లోపద్మం

ముఖం స్పష్టంగా కనపట్టం లేదుకాని ఆ స్వరంతో యేదో విషాదచ్ఛాయలున్నట్లు మనసుకు తోచింది. ఇంకా నాలు గడుగులు వేసిం తరువాత, నే నద్దెకు తీసుకొన్న భాగానికి దారితీసే వలయాకారంగా వున్న మెట్లపంక్తిని చేరుకున్నాము.

"యేమిటి యిది ఇల్లేనా, గాలిరాదు వెలుతురు లేదు. యీ దుమ్ము యీ బూజు, పిచ్చికగూడులాగా యేమిటి మొత్తంమీద చాలా మంచియింటినే సంపాదించా"రంటు కుడిచేత్తో స్తంభాన్ని పట్టుకొని మెట్టుమీద కాలుమోపింది.

అది వలయాకారపు కర్రతో చేసిన మెట్లపంక్తి. పద్మం కాలుమోపేటప్పటికి మెట్లుకొన్ని వూగిసలాడినయి. దాంతో, అదివరదాకా, పద్మం మనస్సులో తేరుకుంటున్న తలపులు ఒక్కసారిగా పైకుబికాయి. ఈ యింట్లో నేను కాలుపెట్టనండి' అంది పద్మం, నిక్కచ్చిగా పద్మంకళ్ళు చెమ్మగిల్లాయి. వాకిట్లో సామానుపెట్టుకొని యింట్లో ప్రవేశించనని పట్టుపట్టిన పద్మం తరహా నాకేమీ బోధపడ లేదు. నాకు కోపంకూడా వచ్చింది. అయితే, యీ సామాను వేసుకొని యెక్కడికి పోదామన్నాను, కొంచెం కఠినంగా.

పద్మం మాట్లాడ లేదు. కన్నీళ్ళు, ముత్యాల్లాగ చెంపల మీదుగా జారిపడుతున్నాయి. ఆ స్థితిలో నేనేం చెయ్యాలి?

ఇంట్లోకి పద్మాన్ని బలవంతంగా రెక్కపట్టుకుని లాక్కెళ్ళనా. అంతపనీ చేసేందుకు నాకు గుండె లేదు. బండ్లనిండా సామాను, నడివీధిలో పెట్టుకొని యెక్కడికి పోవాలి. వున్న

ఇల్లు ఖాళీచేసి వచ్చానా యె ఇంటియజమాని అప్పుడే తాళం కూడా వేసుకొనిపోయి వుంటాడు. ఒక్కనిమిషంసేపు అట్లాగే నుంచున్నాను. పద్మానికి ఇల్లు చూపించకుండా తీసుకోటం చాలా పొరపాటే అయింది. ఆఖరికి మనసు కుదుటపర్చుకుని.

పద్మం నీవుమాత్రం కంటతడితో ఈ యింట్లో కాలు పెట్టవద్దు. వచ్చినదారినే వెళ్ళుదాం పద. యెట్లాగో ఆ యజమాన్నే వేడుకుంటాను. ఇంకా రెండుమూడు రోజులు, నీకు వచ్చేయిల్లు దొరికేటంతవరకూ తలదాచుకుందుకు అవకాశ మిమ్మని. ఆఫీసుకు సెలవుపెట్టయినా ఇల్లు వెతుకుతాను.

ఈ మాటలు వినేసరికి చీరకొంగుతో కన్నీళ్ళు తుడుచుకొని, నే నంత అవ్యక్తురాలను కాదంటూ, త్రాచుపాము లాగ, నన్ను తోసుకుంటు మేడ మెట్లెక్కింది.

ఆ పలుకులు నా హృదయం మీదకూడా దెబ్బల వాతలువేసినాయి.

పద్మం ముందుపోయి ముందుగది గొళ్లెం తీసింది. పైవెలుతురు కిటికీ (Ventilators) మూసి వుండటంవల్ల చీకటిగా వున్నగది నాలుగుమూలలు కనబడేటందుకు, చేతిలోని లాంతరు వెలిగించాను.

*　　*　　*

రోజూ నేను 9 గంటలకే భోజనంచేసి ఆఫీసుకు పోయే వాడిని. మళ్ళీ నేను ఇంటికి వచ్చేవరకు పద్మం బిక్కుబిక్కు మని ఒక్కతే యేదో పుస్తకం చదువుకుంటోనో యేదో అల్లు

కుంటోనో వుండేది. ఇరుగు పొరుగు సంపర్కం లేదు. పద్మానికి చాలా అపచారం చేస్తున్నాననిపించింది. పద్మానికి తెలియకుండానే అనుకూలంగావుండే ఇంకో యిల్లు వెదకడం ప్రారంభించాను. యెక్కడ దొరుకుతాయి ఇళ్లు, పట్టణాల్లో; అద్దెకొంపలు దొరకటమంటే ! మార్కెటుకుపోయి కూరలు పట్టుకురావటమా?

ఆనాడు ఉగాది. ఆఫీసుకు సెలవు. సోమవారం సెలవు యిచ్చాడు మా హెడ్ క్లర్కు. భోజనంచేసి— భుక్తాయాసం తీరేందుకు ముందటిగదిలో చిరుచాప వేసుకు పడుకున్నాను. పద్మం ప్రక్కనే కూర్చొని చెలియలికట్ట చదువుతున్నది అల్లాగేవింటూ పడుకున్నాను. నాకు యెప్పుడు నిద్రపట్టిందో తెలియదు. కళ్ళు తెఱచేసరికి నాలుగు కొట్టారు.

'పద్మం నాకు చక్కని కలవచ్చింది దాని అర్థం యేమిటో నీవు చెప్పగలవా? అంటూ కళ్ళు తెరిచాను.

కళ్ళు తెరవటంతోనే రెండు యెండిపోయిన గడ్డిపరకలు కొంచెం పురికొసపీచు నా యెదురురొమ్ముమీద పడ్డాయి. యెక్కడినుంచి యీ గడ్డిపరక లొచ్చినాయో నాకు బోధపడ లేదు. యెడం ప్రక్కకు తిరిగి చూసేటప్పటికి, ఒక కుప్పగా పడివుంది. యెండిపోయిన గడ్డిపరకలు, పురికొసపీచు, ఇంకా యేమేమో సన్నగా చీల్చిన చెత్త.

ఇంటికప్పువైపు చూశాను యేమీలేదు. యెక్కడి నుంచి వచ్చిందబ్బా యీ చెత్త అని అనుకుంటూ వుండగానే ఓ పిచ్చుకల జంట రెండు గడ్డిపరకలను ముక్కుల్తో కరుచు

కొనివచ్చి, కొంచెం కిందగావున్న అద్దదూలంమీద పెట్టి ఇటుఅటుచూసి దివ్యమని యెగిరిపోయినాయి. ఎగిరిపోతూండగా వేసిన రెక్కల గాలికి ఆ రెండు గడ్డిపరకలు కిందికి జారి పోయినాయి. ప్రతిసారి అవి తీసుకొచ్చి పెట్టటం ఆగడ్డి పరకలు జారి క్రిందపడిపోవటం, ఆ దూలం వెడల్పు లేనిమూలంగ. వాటి పిచ్చికాకపోతే దూలం నడమధ్యగా పెట్టితే గూడు నిలుస్తుందా, అటుఇటు ఆధారం లేనప్పుడు యెన్నిసార్లు అక్కడ పెట్టిన గడ్డిక్రింద పడిపోతున్నవో మళ్లీ అక్కడే గూడు పెట్టుకొనేందుకు ప్రయత్నిస్తాయేం, వాటి మనఃప్రవృత్తి నా కేమాత్రం బోధపడ లేదు. వాటి విఫలప్రయత్నంచూస్తే నాకు జాలేసింది.

'పద్మం.' ఆ చీపురుకట్ట యిట్లా తీసుకరా! అన్నాను పరధ్యానంగా ఆలోచిస్తూ—చదువుతున్న పుస్తకంకాస్తా చటుక్కునమూసి, నా ముఖంవేపు చూస్తూకూర్చుంది. నా ధోరణీ పద్మానికి యేమాత్రం అర్థంకాలేదు. సాధారణంగా చెప్పతీసుకురమ్మంటే యే తేలు వచ్చిందో అనుకుంటాము కర్రతీసుకురమ్మంటే పామేమైన వచ్చిందేమోఅనుకుంటాము. చీపురుకట్ట తీసుకరమ్మంటే యేమొచ్చిందనుకోవాలి? దయ్యం పట్టిన వాళ్లని చీపురుకట్టతో మంత్రిస్తే. దయ్యం పారిపోతుం దంటారు. కాని అది అంతగా అనుభవంతో చూసే విషయంకాదు. అయినా యిక్కడ యెవ్వరికి దయ్యంపట్టింది?

'అబ్బా, చీపురుకట్ట తీసుకురమ్మంటే అట్లాగే కూర్చున్నావు యింకా' అని కొంచెం విసుగుతోఅన్నాను.

'ఎందుకండీ చీపురుకట్ట' అంది పద్మ ఆదుర్దాతో.

'చెప్తాగా, చీపురుకట్ట తీసుకురమ్మంటే' అంటూ కసిరాను. చటుక్కున లేచి ప్రక్కనున్న స్టూల్ తీసుకొచ్చి దూలం కిందుగా వేశాను. ఇంతలోనే పద్మం చీపురుకట్ట తీసుకొచ్చింది. రెండు పొడుగాటి చీపురుపుల్లలు తీసి మధ్యకు విరిచి ఆ దూలం పైకి పైనున్న వాసాలగుండా దూర్చి పందిలిగా వేశాను. గాలికి గడ్డిపరకలు క్రింద పడిపోకుండా 'ఇందుకా!' అంటూ పద్మం నవ్వింది 'చెప్పేమాట సవ్యంగా చెప్పకూడదు. గాబరా పుట్టించారు. ఇవ్వాళ మీ కంట పడ్డది యిది. నెలరోజులనుంచి మాటి మాటికి ఇల్లు ఊడవలేక నేను చస్తున్నాను.'

వారం తిరిగేటప్పటికల్లా పిచ్చికగూడు పూర్తిగా తయారయింది. మళ్ళీ ఇంకోవారానికల్లా రెండు పిచ్చికపిల్లలు కిచకిచమంటూ గూట్లోనుంచి తొంగిచూడటం మొదలు పెట్టినాయి.

ఇప్పుడు పద్మానికి రోజల్లా వాటితో కాలక్షేపం.'

* * *

ఒకనాడు ... ...

'చూడండి—ఆ పిచ్చికపిల్లలు చూడండి. తల్లి ఎల్లా పిటికి ఆహారం పెట్టుతున్నదో —అయ్యో ... అయ్యో... లకపిడతల్లాగ వాటి నోళ్ళు చూడండి. తల్లికోసం గిజగిజా తన్నుకోటం చూడండి. అంటూ పద్మం వాటివంక చూస్తూ

పరవశురాలై పోయింది. అప్పుడు పద్మం కళ్ళల్లో తొంగి చూసే మాతృహృదయం నన్ను దేవలోకానికి లాక్కెళ్ళాయి.

వాటికి యెంత సహాయం చేశారు. ఎంత పుణ్యం కట్టుకున్నారు! అంది పద్మం నా కళ్ళల్లో చూస్తూ పిచ్చిక కూనల్నించి దృష్టి మరల్చి పద్మం కళ్లల్లో చూస్తూ... నిజంగానా! ....అన్నాను సిగ్గుతో. పద్మం నా వక్షస్థలంమీద అట్లాగే వొరిగిపోయింది. జడలోని మల్లెపూవులవాసనలతో నా తల దిమ్మెత్తిపోయింది. యెంత సేపు నేనా అవస్థలో వున్నానో— ఒక క్షణమో? ఒక యుగమో?

'పద్మం! ఇంకోయిల్లు చూడమంటావా? యీ పిచ్చిక గూట్లోనే వుంటావా!' అన్నాను కొంటెగా.

'చాలెద్దురూ!' అంటూ నవ్వుతూ జడలోనుంచి జారిపోతున్న మల్లెపూవొక్కటి నా మొహంమీద విసరింది.

ఆ మల్లెపూవుల తావిలో మా నవ్వుల సిరులు కలసిపోయి గదంతా చుట్టుకున్నాయి. ఆ గదంతా నిండిన ఆనంద తరంగాల్లో ఆ పిచ్చిక కుటుంబం వుయ్యాల లూగింది.

తిక్కన కవితా ప్రతిభ

(ఉత్తరాపరిణయము)

— వెల్దండ ప్రభాకరరావు

రాజరాజనరేంద్రస్థాన మలంకరించిన మృదుమధుర రసభాసురనవార్థవచనరచనా విశారదుడునగు, వాగనుశాసనుడగు నన్నయ భట్టారకుడు నవరస భావానుబంధబంధురముగ నా సభాపర్వముల నారణ్య పర్వార్థమును రచించిన తరువాత మనుమసిద్ధి యాస్థాన కమలాకరా భాస్కరుడును నిస్సీమసాహితీ పటలభాసమానుండును, సోమయాజియును హరిహార ప్రసాదిత కవిత్వ తత్త్వనిరతిశయానుభావానంద భరితాంతఃకరణుడును, యమాత్యశేఖరుడును కవిబ్రహ్మయు నగు తిక్కన మిగిలిన పదేను పర్వములు రసోచితముగ నాంధ్రీకరించిన దెల్లరకు తెల్లమే. అందును విరాటోద్యోగములే యాతని యప్రతిమాన కవితా ప్రతిభయంతయు వ్యక్తముచేయుచున్నవి. కథాకథనమందుగాని పాత్రపోషణమందుగాని, వర్ణనా వైచిత్రియందుగాని యాతడెవ్వరికిని తీసిపోడు ఉత్తరపరిణయముపైన ప్రశంసనా లేశము గావించుటే యీ వ్యాసముయొక్క ముఖ్యోద్దేశము.

పాండవు లజ్ఞాతవాస వత్సరము విందులట్లు మత్స్యేశ్వరసాలాభ్యంతర గృహమున గడపిరి. వారి నియమిత కాలము పూర్తియయ్యెను. వారు ప్రచ్ఛన్న నామధేయులయి

యుండి ఉత్తర దక్షిణగో గ్రహణముల గావించి నుత్తరునికి అర్జునుడు తన నామాదుల తెలిపి వానిని తగు కాలమువరకు ప్రచ్ఛన్నముగ నుంచుమని కోరినాడు. తిక్కన రచనలో నానాటి యాచారవ్యవహారములు, దేశిపలుకుబడులు కన్పించును. ఉత్తరపరిణయ భాగమున

'తెలుపులగు చీరలను బూఁ
తలఁ బువ్వులనొప్పి రాజతనయానుగుణో
జ్జ్వల మాననీయ వేషము
లలవడఁ గూడుకొని నగరికరిగిరి ప్రీతిన్.

పై పద్యములో 'తెలుపులగు చీర'లను చోట ధౌత వస్త్రములని యర్థము చెప్పుకొనవలెను. కాని నేడు 'చీర' అనునది స్త్రీధరించు వస్త్రవిశేషములనే రూఢిచెందినది. పూర్వము 'చీర' శబ్దము స్త్రీపురుష వివక్షలేక ప్రయుక్తమగు చుండెడిదని గ్రహింపవచ్చును. తరువాత 'బూతలఁ బువ్వులనొప్పి' అనుటలో బురుషులు సైతము కస్తూరి, జవ్వాది చందనాదుల నలందుకొనెడివారని తెలియుచున్నది. అంతేగాక, పూలను సైతము ధరించెడివా రనియు చెప్పబడినదిగదా!

అర్జునుడు ధర్మరాజు నెత్తిఁగించుచు "ఈ చిఱుత గద్దియకుం దగడే నరేశ్వరా" యన్నాడు "చిఱుత" యనునది సామాన్య శబ్దముకదా! చిఱుత అను శబ్దమందున్న శక్తి యనిర్వచనీయ మైనది.

'చిఱుత' అనగా 'చిన్న' అని యర్థము. ఇచటి సందర్భమునుబట్టి తిక్కనభావము గ్రహింప బూనినచో 'చిఱుత' యనగా నంతటి ధర్మరాజునకే సింహాసన మొక లెక్కయా యనియు, నీ గద్దియ స్వల్పమైనదనియు నీచమైన దనియు నర్థమును పొదిగించినట్లు వ్యక్తమగును.

దేవేంద్రుని సింహాసనమునకు మత్స్య కుమారమణుని సింహాసనమునకు కుక్కకు కంఠీరవమునకున్న సామ్యమేకదా! అందుకే 'చిఱుత'లో నీచత్వ మారోపింపబడినది. అర్జును నితో నిట్లు పలికింపవచ్చునా 'కడుపులో చల్ల కదలకుండ' విరాటరాజ భవనంబున విందులట్లు పుణ్యదేవతామానదయా సమృద్ధి నతని నొందుటచే నాతని యండనుండి మరల విరాటరాజు నిట్లు కించెపఱుపవచ్చునా యనిన నది ధర్మ రాజు గొప్పతనము చెప్పుట కుద్దేశింపబడిన దేకాని వేఱొండు గాదు. అర్జునుడే మరల "నీ కృపవల్ల విందులట్ల అజ్ఞాత వాస వత్సరమున గర్భవాస గుప్తివల్ల గడపితి"మన్నాడు. ఇట్లే కవిబ్రహ్మ తిక్కన వాడిన చిన్న శబ్దములకుకూడ చాల అర్థపటిమ యుండును. ప్రథమమున పాండవులు తమ సంగతి విరాటరాజునకు చెప్పినపిదప నుత్తరుడు భాషించును.

ఆ వచనములలో నుత్తరుని పాత్రపోషణ పాత్రచిత్రణ మనసమానముగా తిక్కనార్యుడు నిర్వహించినాడు. ఉత్తరుడు సమరాంగణమున రిపుబలముల కోర్వజాలక పిక్కబలమును మాపిన" వీరాగ్రేసర చక్రవర్తి. ఇట్లు పలాయనుడగు నుత్త రుని విన్వచ్చుడు పట్టుకొని తమ నామధేయాదుల తెలిపి

యాతని నుపాయమున నిరపాయకరమగు సూతకృత్యమునకు జొన్పి ఉత్తర గోగ్రహణము గావించినాడు. కృతజ్ఞతా సూచనముగ తత్కాలముననే పాండవుల నెక్కువ మక్కువతో పొగడి వారలపై విరాటునకు సుహృద్భావము కల్గించినా డుత్తరుడు.

మనస్తత్త్వ పరిశీలనము, సంభాషణలో రచనా కౌశలము తిక్కన కవిత్వములో గానవగు విశిష్టగుణములు. ఈ రెండు నుత్తరుని వచనములో మనము చూడగల్గుదుము.

ఉత్తరున కర్జునుడు షండుడని తెలియును. ఆ హేతువు వల్లనే జనకుడు సమరప్రకారమడిగిన "దేవసంజనితుడు నాగ నర్హమగు మహాత్ము డొక్కరుం డని నను గాచె గౌరవుల నందఱ గెల్చె మరల్చె గోవులన్" అని చెప్పియున్నాడు. ఇందర్జునుని దేవసన్నిభుడని చెప్పుటలో విశేషమున్నది. అర్జునుడు సంక్రందన నందనుడు. సంది కైఫాలాక్షునితో పోరిన వీరుడు.

కృష్ణభగవానునకు బావమఱంది. ఇంక నంతటి కురుసైన్యము నెదిర్చి గోగ్రహ నివర్తనము గావించి యద్భుతముగ ప్రవర్తిలెను. కావుననే దేవసన్నిభుడను పద మాతనికి తగియున్నది. శబ్దములకింత యర్థపటిమ గల్గించుటలో తిక్కనదే యగ్రహస్తము.

ఉత్తరుడు వచించుచు నర్జునుడే కురుబలముల నిశిత శర పరంపర కోర్వగల్గెను. నాబలమెంత? నన్నుచిత ప్రియభాషల సూతకృత్యమునకు జొన్పి తమ నామధేయాదుల తెల్పి దానిని కొంతకాలము వఱకు ప్రచ్ఛన్నముగ నుంచుమని కోరి

నాడు. అతడు నిరపాయకరమగు సూతకృత్య మొవ్వగ నేనప్పటి కియ్యకొంటి. ఆ యుద్ధమందుకూడ కురురాజు పరు గెత్తుచుండగ నిది జూదమాడుటగాదని హెచ్చరించినాడు. అట్లు సేయుట కిరీటి కొక్కనికే చెల్లెగాని యితరులకు చెల్లునే? ఈ యుపన్యాసమువల్ల విస్వచ్ఛునిపై విరాటరాజుకు భగవం తుండని భావము కల్పించినాడు. దానివల్ల మత్స్యమహీపా లుండు పాండవుల శరణువేడి వారల సంతుష్టచేతస్కుల గావించినాడు. తిరువాత మాకీ రాజ్యమీయుదురే దీనిని నేలుకొనుడు మా కవసరము లేదన్నాడు. మీకేదే నొకవేళ హాస్తినాపురి కరుగవలసిన యవసర మొచ్చెనేని తగుసహాయ ముచేత మనిచెప్పగా నుత్తరుడు విరాటరాజుతో మనకొక రాజ్యమున్నదా? నన్నుత్తరగోగ్రహణమందు నిన్ను దక్షిణ గోగ్రహణమందు శాత్రవులోడించుచుండ మనల రక్షించునది వీరలేకదా! వారిలిన్నిరోజులు భస్మసంవృత మహాగ్ని కణం బులవోలె నుండిరి గావున వారల తేజము తెలిసికొనక తగు గౌరవము చేయమైతిమి. పరామర్శింపకుంటిమి. కావున మనస్సు సావధానముగనుండ నేరదు. ప్రార్థనచేయుటమంచిది. అదియును గాక వారలకు మనమొక నూత్నమగు కానుక నీయవలె నది యెద్దియను యడుగుదువేని నీ బాలికాలలామ యగు నుత్తర నలంకరింప బంపుము.''అనెను. ఈ మాట లలో నుత్తరుని శీలము చక్కగా పోషింపబడినది. ఆమె నలంకరించిన తరువాత యామె శోభ నొక్క పద్యమందు హృద్యముగ చెప్పినాడు.

క॥ పదవికిరాజులు గడగిన,
మదనాస్త్రము రేఖపగిది మానినిమెయి చె
న్నొందవ గని సేసి రప్పుడు,
ముదితాజనములు ప్రమోదములు లలితముగన్.

ఇందు "పదవికి రాజులు గడగిన" యను పదమెం తయో హృదయంగమంబుగ నున్నది.

తిక్కన కవితలో గానగు ముఖ్యమైనయొక విశిష్టగుణము సాదృశ్యకల్పనము. ఇది యాతని లోకానుభవమును చాటును. జాతీయములైన యుపమానముల నేకొనును. ఉత్తరనుధారాధర నికరమనోహర పర్జన్య లక్ష్మికి పోల్చినాడు.

ఆమెను తీసికొని వచ్చి అర్జునుని వివాహమాడ మన్నాడు. కాని యాతడు మాత్రము నీతిదూరుడా! ఆ యండజయానకు నిండుగ యొక్క యబ్దమాచార్యుడై యుండి నక్కోమలికి నృత్యగీతాదులు నేర్పితిని గాన నే నొల్లను. నా కొమారునకు చేసికొండు నన్నాడు. పోనీ తన కుమారుని యంత యేల పొగడవలెనన్న నాతడుకూడ పెండ్లి పెత్తనము వహించినాడు. తన కుమారుడు పండితమ్మన్యుడు కాడని చెప్పవలదా! అతడు సుగుణ రత్నాకరుడని యందఱి కిని తెలియువలెను. తన కుమారుడు కురూపియని చెప్పవా డుండునా! ఒక్క వస్తువను గూర్చి చెప్పవలెనన్న దానిని పెక్కువిధములు వర్ణింపవలెను. కావుననే యాతడు గోపాలుని మేనల్లుడు, ఆర్యసమ్మతుడు, విద్యావంతుడు, అత్యుదారతేజుండని చెప్పినాడు. ఆ రోజులలో పిల్లలబుద్ధి విశేషాదు

లెక్కన లెక్కింపబడుచుండెడివి. అత్యూరు తేజుడనగా నాతడు గౌరవప్రదమైన వంశజుడని చెప్పియున్నాడు. ఉత్తర వరింపవలెకదా? మఱి 'కన్యావరయతే రూపం' యని కదా వచనము. దానికి సమాధానము అత్యూరు తేజుండని అనగా నసమాన సౌందర్యమున్ననే యాతని కప్రతిమాన తేజ ముండునని వ్యంగ్యార్థము.

తరువాత వివాహమున కనుకూలమగు సన్నాహములు జరిగినవి. శ్రీకృష్ణాదు లరుదెంచిరి. ఈ యుత్తరా పరిణయములో నింకొక చిన్న గాథ కలదు. దుర్యోధనున కొక సందేహము కల్గినది. పాండవుల యజ్ఞాతవాసము పూర్తి కాకముందే వారుపోయి వారి నెదుర్కొనిరేమోయని. తచ్ఛంకా నివృత్తికై ధర్మరాజునొద్ద కొక దూత నంపినాడు. వాడును ధర్మజునొద్దకు పోయి యీ విషయము నివేదింప నాతడు "నిండెనాడె సమాబ్దంబులు నిండెనిండెననుము నిక్కముగన్" అన్నాడు. అతడట్లే యొనర్చినాడు. ఈ విషయము ప్రచ్ఛన్నముగనుంచి తన వారల తెలిసికొన్నాడు. ఈ విషయమును కొద్దిలోనే ముగించాడు. 'నిండెనిండె' యను పునరుక్తిలో నొక విధమైన వైశిష్ట్యమున్నది. ఒక విషయము నిజమని చెప్పవలెనన్న దానిని రెండుమూడు మారులు చెప్పినగాని యది నిజముగ కనపడదు. ఇట్లే భారతములో తిక్కనకవివరుండు విస్తరించి వ్రాయవలసి వచ్చినప్పుడు విస్తరించుచు, గురింపవలసి వచ్చినప్పుడు గురించుచు నాంధ్రీకరించినాడు.

వివాహసన్నాహావసరమున పుర మలంకరింపబడినది. అదియును నానాటి దేశ కులాచారానుగుణముగనే క్రముకకాండమోచా స్తంభములు నాటుట, కుంకుమముచే గోడలయందలికి ముగ్గులిడుట యిత్యాదులు. ఆ పట్టణము వివాహోత్సవ మాధవ లక్ష్మికి లలితోద్యానవనంబయి సెలంగె ననుటలో చక్కని యలంకారము పొందించినాడు.

వివాహమునకు ముందు వధూవరులు నొకరినొకరు చూచుకోలేదు. అప్పుడే తెర తెచ్చిపెట్టినారు. మధ్యలో వారికి వినుకలివల్లనే ప్రేమగల్గినది; నలదమయంతులవలె తెరతీసిన వెనుకనే యన్యోన్యావలోకనము ప్రారంభమైనది. ఇచటి పద్యము మనోహరము:

వీనులందియ్యెడ మెక్కుమును విన్కిఁ బరస్పరరాగ వృత్తిలో
నూనినఁ జూచు వేడుకల నువ్విళులూరెడు నెమ్మనంబు ల
లచ్చోనొక యింత సేపు నెడ సొచ్చుట కోర్వకయుండ నున్న య
మ్మానినియుం గుమారుఁడును మార వికారము లంకురింపన్.

మొదటి యభిమన్యుఁడా సుందరాంగి ముఖావలోకన గావించి మఱల నా సంగతి యెవరేని చూతురేమోయని తలవాల్చుకొనినాడు. అభిమన్యునకు మాత్రము లజ్జలేదా! ఈతడు ప్రథమముననే యామెను తేరిపార జూచినాడు. ఆమె చూపు పాదాంగ్రములనుండి పైకి యెగబ్రాకుచున్నది. కాంతకు లజ్జా బిడియములుండును గావున నతని నపాంగవీక్షణమున జూచినది. తిక్కనార్యుడు శృంగారరసము చక్కగా పోషించి నాడు. "లలిత తనూవిలాసముల"అను హృద్యపద్యములో

అభిమన్యు డుత్తరపాణిగ్రహణము చేయుట పల్లవాచుంబిత మత్తేభ లీలయని చక్కని యుపమానమును పొదిగినారు. ఇచ్చట శ్రీహర్షుని గీర్వాణముస ప్రియదర్శికా ప్రస్తావనలోని శ్లోకము జ్ఞప్తికి వచ్చుచున్నది. ఇది పార్వతీ కల్యాణమందు వధూవరులే కాననమునందున్నట్టివేళ జరిగిన వధూవరుల (పార్వతీ పరమేశ్వరుల) అన్యోన్యావలోకనము. దానిని జూచియే కాబోలు ఉత్తరాభిమన్యు లేకాననముపైన నున్నవేళ కోర్కులు కెడగూడుకొని'' అను పద్యము వ్రాసినారు.

ధూమవ్యాకులదృష్టి రిందుకిరణై రాహ్లాదితాక్షీ పునః
పశ్యంతీవర ముత్సుకానతముఖీ భూయో ప్రియ బ్రాహ్మణః
సేర్ష్యాపాదనఖేందుదర్పణగతే గంగావధానేవారే
స్వాన్యానుత్పలకాకరగ్రహ విధౌ గౌరీ శివాయా స్తువః.

వివాహము మంగళ సంవిధాన సావధాన పుణ్యాంగన వలనను నృత్యగీతాది వైచిత్ర్య మనోహర వారనారీ జనంబు వలనను వినూత్నరత్నమయ భూషణాది దీప్తవేషవిరాజమానులగు చతురపరిహాస విలాసాదుల వలనను ప్రభూత విభవ విఖ్యాతులగు రాజసూనుల మాననీయగరిమా లలిత విహార విశేషంబులవలనను పరమ సంపద్భరితమై ఉత్తరా కల్యాణము పూర్తియయ్యెను. అది యానాటి దేశకాల పాత్రములకు ప్రతిబింబ మేమో?

(7)

స్వాతంత్ర్య యోగము

—పరిమి వేంకటావధాని

అది బందీ

అందు నేను విహంగ సంతతుల గానమును వింటిని. ఏత న్మధురిమ స్వాతంత్ర్య సంబంధి యనికొంటిని.

అందు నేను సెలయేళ్ళ మృదంగ నిస్వనము వింటిని. అందలి లయబ్రహ్మము స్వాతంత్ర్య సంబంధి యనుకొంటిని.

అందాక శుభోదయవేళ కిసలయములయు బాల సూర్యునియు రక్తిమ గంటిని. అందలి రాగము స్వాతంత్ర్య సంబంధి యంటిని.

అటుపై నొక పాతంజలుని యోగశాస్త్రసాధకుని, పంచభూతములనురికియే స్వాతంత్ర్యమును సాధించువానిని, ద్రష్టగానుండ ప్రయత్నించువానిని పరిశీలించితిని. కాని సాధనయు స్వాతంత్ర్యము పరమావధిగా గలదిగా ననుమానించితిని. అది నా మనసున రూఢియైనది.

శరచ్చంద్రుని జ్యోత్స్నలో పరిశుభ్రతకు కారణము పారతంత్ర్య మలినము లేకుండుటని, మయూర నృత్యము నందలి ప్రమోదభావమునకు కారణము పారతంత్ర మలినము లేకుండుటని; పుష్పసౌరభపు వ్యాపనాశక్తికి కారణము పారతంత్ర్య మలినము లేకుండుటని గ్రహించితిని. కాని ఇవన్నియు నాకుద్దీపన విభావములేయై నాలో 'తపము'ను కల్పించెను.

వేలనన నేను బందీ నై పోతిని.

నా తాపమును చూచి కొందరు జాలిపడిరి. కొందరది పిచ్చియని పరిహాసించిరి. కొందరవి అల్లరి గంతులని చిన్నబుచ్చిరి. అన్నవస్త్రములకే కదా ఈ యాత్రమని కొందరు మందలించిరి. కొందరు తపమును మానుమని హింసించిరి. కొందరు నాతో పాటు తపమూనిరి. కాని నా తపము నేనెట్లు మానగలను? నాది విజ్ఞానశోధయంటిని. నాది బ్రహ్మజిజ్ఞాసయేయని యంటిని. వారి కర్ధమగునని నాది స్వాతంత్ర్య యోగమంటిని. అది మోక్షసాధన మంటిని. నన్ను బందిగొన్నవానితో నిట్లంటిని—"నీవు నన్ను చెర బెట్టితివి—అది పాపము—నీ పాపమునకు నేనే తపమాచరింతును. అదే నా విప్లవము" అని.

నా తాపము అంతటితో తీరలేదు. నా తపమారలేదు—నాతో ననేకులు తపమూనిరి. మా తపశ్శక్తికి ప్రపంచమే సంచలించెన్—తుదకు—

నా శక్తికి నాకే విస్మయ మయ్యెను. నేను బందినైతినని నేను విషాదగాన మాలపించలేదు. దరిద్రనారాయణుని దారిద్రమునే నేను తడవలేదు. అతని 'నారాయణత్వమే' అతనికి నేను బోధించితిని. నా ఈశక్తికి కారణ మరయుకొనుధ్యానమూనితిని. ఇట్టిపోక లెక్కలోనిది కాదని నాకుతట్టెను. మరింత విస్మితుడనై తీవ్రతరమైన చిత్తవృత్తి నిరోధమును సల్పితిని—నా హృదయమునుండి సమాధానముగా 'తత్త్వమసి' అని వినబడెను.

కథానిక

—శ్రీ బూర్గుల రంగనాథరావు

చిన్న కథ లేక కథానిక మనం యితర సారస్వతాల్లో నించి గ్రహించింది కాదని మన పూర్వ సాహిత్యంలో దాని లక్షణాలు పూర్తిగా నిర్వచింపబడటం మూలాన తెలుసుకుంటున్నాము. అగ్నిపురాణంలోని గద్యకావ్య భాగంలో కథానికకూడా చేరిందని ఈ శ్లోకంవల్ల తెలిసికోవచ్చు.

> ఆఖ్యాయికా, కథా ఖండకథా పరికథాతథా
> కథానికేతి మన్యంతే గద్యకావ్యంచపంచా ॥

అగ్నిపురాణంకన్న పూర్వం దండాచార్యులు అనే అతడుకూడా ఆఖ్యాయిక, ఆఖ్యానము కథ అనే విభాగాలు వున్నట్టు వ్రాశాడని తెలుస్తున్నాది. శ్రీ తల్లావఝులవారు కూడా తమ ఏకాదసి, పీఠికలో మనకు కథ,కథానకము, ఆఖ్యానకము ఆఖ్యాయక అనే గద్య విభాగాలు వున్నట్టు వ్రాశారు. కాబట్టి మనకు చిన్నకథ అనేది పూర్వంనించే వస్తున్నది.

చిన్న కథ యిన్నివిధాలుగా వుంటుందని లెక్కించి చెప్పలేము. ఒక్కొక్కకథలో ఒకేదృష్టిగాని కొన్ని దృష్టులుగాని కలిసి వుండవచ్చును. నేడు మనభాషలోకి వస్తున్న కథానికలను పరిశీలిస్తే అవి కొన్ని కల్పితాలుగాను, కొన్ని అనువాదాలుగాను, కొన్ని అనుకరణాలుగాను వుంటున్నావి.

ఈ ఒక్కొక్క దానిలోనే యెన్నో విధాలయిన కథలు కన
పడతాయి. ఇటీవల లింగీయ (Sex) కథలుగూడా ప్రబలి
పోయాయి. బహుశః వీటికి అవసరముకన్న యెక్కువ ప్రాధా
న్యత యివ్వబడుతున్న దేమో అనిపిస్తున్నది. ఇంకా అనేకులు
చిత్తవిభ్రమం (Fancy) వల్ల కలిగే భావాలను కథారూ
పంతో చిత్రిస్తున్నారు. కథారూపం వున్నా లేకున్నా
(Sketches) గల్పికలు వ్రాసిపారేస్తున్నారు. వీరు తమ
చిత్తానికి యేమాత్రం చలనం కలిగినా దాన్ని వెనుక వేసు
కుని, పగటికలలు కంటూ ఊహా విమానాల్లో యెగురుతూ
యిష్టంవచ్చినట్లు విశృంఖల విహారం చేస్తున్నారు. వీరికథల్లో
సంకీర్ణత, అస్పష్టత సహజంగా కనిపిస్తాయి. ఈ చిత్తవిభ్రమ
కథకులకు విరుద్ధంగా, పరిణత ప్రజ్ఞలు కొందరు కార్యకారణ
సహితమైన హృదయంగమ భావప్రోద్బలం (Imagnation)
చేత ఉత్తమ తరగతికి చెందే కథలు వ్రాస్తున్నారు. ఆంధ్ర
కథక చక్రవర్తు లనదగు చింతా దీక్షితులుగారే యిందుకు
నిదర్శనం. టాగూరు, ప్రేంచంద్, ఇంగ్లీషులో ప్రిట్ చెట్ మొద
లగువారంతా ఈ తరగతి కథకుల్లో చేర్తారు. వీరికథల్లో భావం
ఉపజ్ఞ, ఉదాత్తత, స్పష్టత అనే నాలుగు సుగుణాలు సాధార
ణంగా చదువరులకు కనిపిస్తాయి. ఇంతేగాక సునితమైన పరి
శీలనతో, చక్కని ఔచితిని పాటించినారు వీరు తమకథల్లో.

హెచ్. జి. వెల్సులాంటివారు అన్యాపదేశమైన కథలు
వ్రాస్తున్నారు. ఇవి ఒక విధమైన అవ్యక్తార్థం స్ఫురింపజేసి
ఆనందం కలుగజేస్తాయి. పాశ్చాత్యుల (Idealism) ఐడియ

లిజంను ఆదర్శత్వాన్ని కొందరు అనుసరిస్తున్నారు వాస్తవానుభవాన్నే (Realism) చిత్రించాలని మరికొంద రంటున్నారు. అంతకన్న ఓ మెట్టెక్కి, కొందరు సర్ - రియలిస్టిక్ కథలు వ్రాస్తున్నారు. ఇక, హాస్యరస ప్రధానమైన కథలు కొందరు వ్రాస్తున్నారు. అవి మనకు చాలా కొద్దిగా వున్నాయి.. ఇంకా ఎక్కువగా కావాలి.

ప్రణయమే ఒకరికి ఉపాదేయమౌతే ప్రళయం ఇంకొకడికి ఉపాదేయమౌతున్నది. సుఖాన్ని ఒకడుచూస్తే దుఃఖాన్నియింకొకడు చూస్తున్నాడు. దారిద్ర్యం, దాస్యం, బాధలో నలిచి క్రాంతిజ్వాల సహాయంతో బొల్షివిస్టు మంత్రాలతో బయలుపడే వ్రాతలు వ్రాస్తామంటునారు. అభ్యుదయ రచయితలు కొందరు.

ఇన్ని విధాలైన భిన్నభిన్న అభిప్రాయాల్లోను దృక్పథాల్లోనూ పడి కొట్టుకొంటున్న మన తెలుగు చిన్న కథ ఇంకా అపక్వస్థితి (Melting pot) లోనే వున్నదని చెప్పాల్సివస్తుంది.

దీని కంతటికీ కారణం గత యుద్ధానంతరం పాశ్చాత్య సాహిత్యంలో వచ్చిన నిరాశ, దానితో కూడివుండే అధిక్షేప వక్రోక్తి పురోభాగిత్వం (Cynicism) యథాదర్శనం నిజమైన భావనకు మారుగ భావోన్మాదం: ఇవే మన సాహిత్యాన్నికూడా చాలవరకు తారుమారు చేశాయి. అని అన్న శ్రీ కురుగంటివారితో మన మేకీభవించవచ్చు. కాబట్టి వీటి ప్రోద్బలం (Influence) మన కథానికల్లోకూడా కనపడటం ఏమాత్రం ఆశ్చర్యంకాదు. ఈవక్రోక్తి, అధిక్షేపం (Sature

భమిడిపాటి, విశ్వనాథ కవిరాజు రచనల్లో బాగా బహిర్గత మౌతున్నది.

— ♦ ఇంగ్లీషు కథానిక ♦ —

౨౦ శతాబ్దపు ఆంగ్ల సారస్వతానికి చిన్న కథ ఒక ఉమూల్యాలంకరణం. స్వతంత్రమైన పోకడలతో నూతన మైన ఉపజ్ఞతా నేటి ఇంగ్లీషు సారస్వతాన్ని పెంపొందింప జేసింది. కథానికే అంటే అతిశయోక్తి కాజాలదు. ఒక ఆంగ్ల విమర్శకుడి అభిప్రాయ ప్రకారం ఇంగ్లీషు నవలా వాఙ్మయం సామాన్యంగా శిల్పరాహిత్యమై స్వోత్కర్షా ఫలితమగు అయోమయత్వంలో ప్రాకులాడుతున్నది. కవిత్వంకూడా ఒక విలక్షణలక్ష్యంతో లేదు. ఎందుచేతనంటే కవులు ఒకవైపు(Lyrical లిరికల్ సాంప్రదాయం మరొక వైపు, కవులు తమ సాంఘిక బాధ్యతలను గుర్తించాలనే సూత్రం మధ్యా తంటాలుపడుతున్నారు. మన తెలుగు కథానికకూడా అదే స్థితియందున్నది. కాని పాశ్చాత్య కథానిక మాత్రం తన త్రోవను చక్కగా నిశ్చయించు కున్నట్లు తోస్తున్నది. రాజకీయాలేవిధంగామారినా కథానికను మార్చలేవు. కళయొక్క ఆశయం యేదైనా కావచ్చును కాని ప్రచారం (Propaganda) మాత్రం యెప్పుడూ కాదు.)

కథానిక పాశ్చాత్య దేశంలో ఒక విధమైన క్రమ వికాసం పొంది చక్కని మార్గాల్లో సంచరిస్తున్నది.

ఫ్రాన్సు దేశంలో మొపాసా (Mapassaunt) రష్యాలో (Anotonchekhov) ఆన్‌టన్ చెకోవులసలు కథానికయొక్క

సంపూర్ణ స్వరూపాన్నీ, దాని యొక్క అనేక ఉత్కృష్ట గుణాలను లోకానికి వెల్లడిచేశారు. ఆధునిక కథారచయిత లందరూ ప్రత్యక్షంగానో పరోక్షంగానో ఈ యిద్దరు మహా నీయులను అనుకరించి వారినుంచి ఉత్సాహం Inspiration తీసుకుంటూనే వున్నారు. ఈ యిద్దరూ గొప్పవాళ్లే కాని యిద్దరి రచనలోనూ యెంతో భేదం వున్నది ఇద్దరూ చెరి యొక మార్గాన్ని చూపించారు కథానికకు.

మొపాసాకన్న చెకోవు, కథల కూర్పులో సిద్ధహ స్తుడు. ఇంగ్లీషు కథావాఙ్మయము మొపాసాకన్న చెకోవుకే యెక్కువ ఋణపడివుంది. చెకోవు జీవితంలోని ఒక భాగాన్ని తీసుకుని తనకథాకథన శిల్పంలో గ్రథనంచేస్తాడు. ఈ శిల్పశక్తి అనే సూక్ష్మదర్శినితో మానవ జీవితాల్ని జాగ్రతగా పరీక్షించి పఠితల కళ్లయెదట నిష్పాక్షికంగా తన పాత్రలను ప్రదర్శించి, ప్రస్తుతాన్ని అధిగమించి పూర్వోత్త రాభిముఖాల్లో యెంతో దూరంవరకూ తన కళాకాంతుల్ని వెదజల్లుతాడు ఇవే లక్షణాలు ప్రేంచంద్ కథల్లోనూ కన పడతాయి. చెకోవు స్వయంగా వైద్యుడుగాబట్టి అతని కళ యెప్పుడూ సశాస్త్రీయమై విచక్షణా యుక్తమై ప్రకృతి తత్వానుసరణియై సహజ చిత్రగతిలో ఆనంద సంధాయ కంగా వుంటుంది. సశాస్త్రీయంగా వ్రాయజాలని పక్షంలో అసలు వ్రాయడం మానుకుంటానని అతడే ఒకచోట చెప్పు కొన్నాడు.

చెకోవుతోడి, ఆధునిక కథాస్రష్టయైన మొపాసాలో కావ్యలక్షణాలు (Lyricism) యెక్కువగా అగుపిస్తుంది.

కథయొక్క ఆకృతికి, దాని ప్రతిభాగాన్ని కళావం తంగా చేయడానికి యీ (Lyricl element) చాలాముఖ్యం ఈ (Lyricism కై మొపాసా ప్రత్యేక ప్రయత్న మేమీ చేయలేదు. అతని కథాకథన విధానంలోనే సహజంగా అంత ర్భూతమై అతడి కళాభిజ్ఞతను శబ్దాల్లో చాటుతున్నది. కాబట్టి మపాసా ఆధునిక కవులకు మార్గదర్శకుడయ్యాడు. ఓహెన్రీ డి. ఏచ్. లారెన్సు బేట్సు మొదలగువా రంతా అతని అనుసరియాయులే. స్త్రీపురుషుల స్వేచ్ఛాంచ ప్రవర్త నాన్ని ప్రతిపాదించాడు గాబట్టి వస్తుతతః కూడా ఆధునికుల మనస్సులను చూరగొన్నాడు మపాసా. ఇక కథానిక లక్ష ణాలు చర్చించుతాము. కథానికగూడాఒక కావ్య విభాగమె గాబట్టి ఉత్తమ కావ్యాని కుండవలసిన లక్షణాలే ఉత్తమ కథకుకూడా వుండాలి. అయితే కథానికకు ప్రాయికంగా రెండు బాహ్య లక్షణా లున్నాయని శ్రీ కురుగంటివారు సూచించారు.[1] ఒకటి కథ చిన్నదిగా ఉండడం. రెండవది కథ ఏాందికగావుండి శబ్దార్థ క్షిప్తతతో కథాశరీరం బిగిసిపోకుండా వుండడం. అభ్యంతర లక్షణాలు మూడు అని మన పూర్వ లాక్షిణుకులే యేర్పాటు చేశారు. అవియేమంటే ఒకటి: కథలో పఠితను భయసంభ్రమాశ్చర్యాల్లో ముంచేవి చిత్ర సంఘట నాలుండాలె. రెండవది : కథాగర్భంలో హృదయం కరిగించే సన్నివేశం కూర్చాలి. మూడవది పాఠకుల అభిముఖ్యత (Interest) జారిపోకుండా వారు అనుకోని కొత్తమలుపు లతో కథసాఫీగా ముగిసిపోవాలె.[2] బాహ్యలక్షణాల్లో రెండూ

1, 2. నవ్యాంధ్ర సాహిత్య వీథులు

ముఖ్యమే. అభ్యంతర లక్షణాల్లో ఏ ఒక లక్షణం లోపించినా క్షతి లేదు. అంతేకాదు అద్భుత నిర్వహణవుంటే ఏ ఒక లక్షణమున్నా పరవాలేదు. కాని ఆ సమర్థత ఆ ఉపజ్ఞ ఆ నిర్వహణం లేకపోతే మాత్రం ఎన్ని లక్షణాలున్నా కథానిక కమ్మగా వుండదు. ఈ లక్షణాలే పాశ్చాత్య కథాకర్తలగు చెకోవ్, గాల్స్‌వర్దీ, వెల్స్ రచనల్లో భారతీయ రచయితలగు టాగూర్ ప్రేంచందుగారి కథల్లో, చింతా దీక్షితులు శ్రీపాద మొదలగువారి కథల్లోనూ కనిపిస్తాయి.

భావము, వస్తువ, రచన అనే ఈ మూడు అంశాల ప్రాధాన్యత కావ్యానికెట్లో కథానికకుగూడా అంతే. ఇతివృత్తము, లేక కథావస్తువయొక్క విశిష్టత, ఆకథ పఠితల్లో కలుగజేసే ప్రేరణాశక్తి (Compelling Force) పైన, వారికి దానియందుండు ఉత్సాహాభి ముఖ్యం (Interest) పైన ఆధారపడి వుంటుంది. ఈ వస్తువును మిక్కిలి రమ్యంగా యోగ్యమైన శబ్ద సంగ్రహణంచేతనూ సునిశితమైన నేయార్థం (Appeal) వల్లనూ చక్కని పాత్ర పోషణతోడనూ శిల్పాకృతిగా ప్రదర్శించాలి. భావం హృదయాన్ని, వస్తువు చిత్తాన్ని రచన శ్రవణేంద్రియాన్ని ఆనందింప జేస్తాయి. కథానికల్లో, ఈ వస్తువ అనేది, మానవ మనస్సంబంధమైన ఒక క్రియనేకాని సన్నివేశాన్నే కాని ప్రదర్శించాలి. కథాబీజం ఒకే ఒక ముఖ్యసన్నివేశం (Centric Episode) తో సంబంధించి వుండాలి. రచయిత కళాధినివేశుడైతే అతడు జీవితంలోని ఒక ఘటియనైనా సరే చక్కగా చిత్రించి చదువరుల భావములను పల్లవింపజేసి, వారినే వారివారి సంస్కా-

రాల ప్రకారం ఆ కథను పూర్తిచేసుకునేట్టు చేస్తాను. నిశ్చల మైన ఒక సరస్సులో ఒక చిన్న రాయిని వేస్తే అది నీటిలో చిన్నచిన్న అలలను సృష్టిస్తుంది. ఆ అలలు ఒకదానికన్న ఒకటి విశాలమై గుండ్రంగా వ్యాపిస్తూ బలహీనంగానైనా తాము ఉద్భవింప జేసిన శక్తిని (Energy) ఒడ్డువరకూ అందజేస్తాయి. ఈ శక్తి ఆరాయియొక్క ఆకారము బరువు మీద ఆధారపడి వుంటుంది. అలాగే మన జీవితంలో విసర బడ్డ యిలాంటి కథానిక బహుముఖమయిన మానవ జీవితపు టంచుల నన్నింటినీ స్పృశించాలి.

కథానికలో కావ్యభాష వాడితే జీవకళ చెదిరిపో తుంది. వాడుకభాష వాడడమే చాల మంచిది. చ్యుత సంస్కారం కాని గ్రాంథికభాష వాడినవాళ్ళలో విశ్వనాథ వారిని, చింతా దీక్షితులుగారిని పేర్కొనవచ్చును. తెలుగు నుడికారాలతో సజాతీయమైన భాషలో, ఆయా పాత్రలచేత పలికిస్తూ వాళ్ళను మనం ప్రత్యక్షంగా చూస్తున్నామా అన్నట్టు వ్రాయగల సమర్థులు శ్రీపాదవారు. వీరు కథా కథనంలో సిద్ధహస్తులు. అభిజాత రమణీయమైన భావ్య చిత్రముకు ఉపజ్ఞా సహితమైన భావనకు, వారికథలే నిదర్శ నాలు. ఆ కథలు చదివితే కొంతకాలం జ్ఞాపకం పెట్టుకో లేకుండా వుండలేము. తెలుగుభాషలో వాటికవే సాటి అన్నట్టు వుంటాయి. పాత్రోచిత భాష వాడాలనే సూత్రా నికి కతికినట్లు మన గోఖలేగారు వ్రాస్తారు. వీరు ఒక యెరు కల కుటుంబానికి సంబంధించిన కథ వ్రాస్తారనుకోండి. అట్లా వ్రాస్తే ఆ ఎరుకల భాషనే అచ్చంగా ఉపయోగిస్తారు. అంతే

కాక వాళ్ళ ఉచ్చారణ వాళ్ళ నుడికారం సరిగ్గా అర్థమయ్యేట్లు గుణింతాన్ని వింతగా వ్రాస్తారు. ఇలాంటిభాష వాడితే అందరికీ అర్థంకాదు. ఏ ప్రాంతీయ భాష ఆ ప్రాంతీయులకు మాత్రమే బాగా అర్థమౌతుంది కాబట్టి సామాన్యంగా అందరికీ అర్థమయ్యే జీవద్భాషే. యోగ్యంగా వుంటుంది. కథానికకు వాస్తవలోకాతిక్రమణము రసభావ పూర్తిచే బుద్ధియందంకురించు వ్యక్తిగత సంస్కార విశేషమునే పాశ్చాత్యులు (Idealism) అంటారు. కాని వారికది ప్రత్యక్షానుభవ విషయంకాదు. తత్సంబంధమైన రసానుభవంకూడా లేదు వారికి. వారి ఆదర్శత్వం (Idealism) ఊహాకల్పితమైంది."

"భారతీయుల ఆదర్శత్వం దానికి భిన్నమైనది. భారత ధర్మము నివృత్తి పూర్వకము కావున ఆధ్యాత్మిక జ్ఞానసంపద భారతజాతీయ జీవనముల నావరించి ప్రకృతి గతమై పాదుకొనిపోయినది. భారత కవిత అట్టి సంస్కృతియందు పుట్టి పెరిగిన దగుటచే భారత కవుల (Idealism) ప్రత్యక్షవిషయం."

ఈ పై వాక్యాలు ము॥ కృష్ణారావుగారి 'సమీక్ష' అనే విమర్శక గ్రంథంలోనివి. వీనివల్లమనం ప్రాచ్యపాశ్చాత్య ఆదర్శత్వాల తత్వభేదం తెలుసుకున్నాం. కవి, తాను నివసించివున్న ప్రపంచంలోనించి తానుకల్పించిన భావప్రపంచం ద్వారా తాను ప్రత్యక్షానుభవం పొంది తదనురూపానందం పాఠకుడిలో కలిగించాలి. ఉత్తమ కథకుడి ఆదర్శంగూడా యిదే విధంగా వుండాలి. (Arthur Symons) చెప్పినట్టు నేటి కవిత్వంలోనేమి, చిన్న కథలోనేమి మొడ తెగని పరిశోధనా తృష్ణ (A restless curiosity) ఆధ్యాత్మికంగాను

నైతికంగాను పెడ|్రోవపట్టుకు (A spiritual and moral perversity) ఒకదానికన్న యింకొకటి అతిక్లిష్టతరమూ అతి సున్నితమూ అయిన మెరుగులు పెట్టడం (An Over subtilizing refinement upon refinement) కనిపిస్తున్నది. పాశ్చాత్యదేశంలోని యీ పరివర్తన మన దగ్గరికి కూడావచ్చి |వేళ్ళుతన్ని పాతుకు పోయింది. కాబట్టి కథకు ముఖ్యంగా కథాకథన కళకు నీతి, ఆదర్శం వుండాలా అనే |పశ్న అ|పస్తుతమయింది. నీతి ఆదర్శం యెప్పుడైతే అ పస్తుతమై పోయిందో యిహ మిగిలింది రసవాదం. కళకు కళయే |పయోజనం (Art for Arts sake) విషయం తీసికోవాలి. కథకుడికి స్వానందమేగాక పరానందముకూడా |పాచ్యమూ ఆదర్శమూ అయివుండాలి. ఇతరుల ఆనందంకోసం కాని కళ నిజమైన కళ కాదు. ఇటు నీతి అటు ఆదర్శాన్ని దాటివచ్చి కేవలం కావ్యానందంకోసం |పాకులాడారు కొంతకాలం పాశ్చాత్యులు. అప్పుడు సరే బాగానేవుంది. 'రమణీయార్థ |పతిపాదక శబ్దం కావ్యం' అనే దృష్టిలో అని మనమూ వారిని అనుకరించాము. తరువాత బెర్నార్డుషా మొదలగు వారి రచనలవల్ల (Utility Theory) |పయోజనావాదం బయలుదేరింది. అంటే యింకో విధంగా లోకకల్యాణం, విశ్వ|శేయస్కరం' అనే మన పూర్వ సాం|పదాయానికి దగ్గరగా వచ్చారన్న మాట ఆ వృత్తము (Circle) ముగించుకోని. ఇది ఓ విధంగా బాగానేఉంది.

కథాపరమార్థమేమి? ఏవాఙ్మయములో చూసినా ఏ కావ్య విభాగం చూసినా మానవ నైసర్గిక వికారాలకు

కామక్రోధాదులను (Fundamental human emotions) ఆ యితివృత్తం ప్రతిఫలింపజేసి పఠితల చిత్తాలకు హత్తుకునేట్టు చేయడంతప్ప యింకేమీ వుండదు.

Realism యథార్థదర్శనం

వాస్తవానుభవ చిత్రంవల్లకూడా ఒక విధమైన ఆనందం కలుగుతుంది. మనకథకుల్లో మునిమాణిక్యం మొక్కపాటి భమిడిపాట్యాదులు కలిగించిన ఆనందం యిట్టిదే. మునిమాణిక్యం నరసింహారావుగారి కథలు తీసుకోండి. వారు సామాన్య కుటుంబాల్లోని దాంపత్య జీవితాలను యెంతె మధురంగా యెంతె సహజంగా వర్ణించారో తెలుస్తుంది. సంసారంలోని తాపత్రయం, చికాకు దెబ్బలాటలు అన్న ప్రేమమయంగానూ వాంఛనీయంగానూ కనిపిస్తాయి. పఠితకు. అవివాహితుడైన పాఠకుడికి వెంటనే పెళ్ళి చేసికొని ఆ ఆనందం ప్రత్యక్షంగా అనుభవించాలనిపిస్తుంది. అట్లాగే ఉత్తమ హాస్య ప్రధానమైన మొక్కపాటి నరసింహాశాస్త్రి, భమిడిపాటి కామేశ్వరరావు, సురవరం ప్రతాపరెడ్డిగార్ల రచనలు ఆనందాన్ని కలుగజేస్తాయి.

నేడు యెంతో మంది యెన్నో రకాలైన కథలు వ్రాస్తున్నారు. మన కళ్ళకు కనపడకుండా పోయేవియెన్నో! ఉత్పత్తి బాగానేవుంది. ఉత్పత్తిని కొంచంఆపి, రకాన్ని అభివృద్ధిపరచి, దేశీయుల అవసరాలను పూర్తిచేసే కథలు వ్రాస్తే బావుంటుందనీ, ముఖదృష్టి నెలలతో బోల్తా పడవద్దనిన్నీ నవరచయితలకు మనవిచేస్తూ ఈ భాషణ యింతటితో ముగిస్తున్నాను.

హైదరాబాదు రేడియోవారి అనుమతి 30—6—43.

ఆత్మార్పణం

—భండారు చంద్రమౌళీశ్వరరావు

ఆమె ఓవిచిత్రమైన వ్యక్తి. ఇతరులతో సామాన్యంగా ఎన్నడూ మాట్లాడదు. ఎప్పుడూ గంభీరంగా ఉంటుంది. ఏకభుక్తం. వదనం ప్రసన్నంగా ఎప్పుడు అగుపడదు. ఆమెనంతా 'పంతులమ్మగా'రని పిలుస్తారు. తెల్లనిబట్టలు తప్ప మరే విధమైన దుస్తులు ధరించేదికాదు. మా ఊళ్ళోవున్న పరోపకారిణీ పాఠశాల్లో ఆమె పంతులమ్మ. ఆమె వుండేది సేవాశ్రమంలో. తన జీతంలో నెలకు పదిహేనురూపాయిలు మాత్రమే తీసికొని మిగతాది సేవాశ్రమాని కిచ్చేది. అక్కడ వుండే అనాధులకు చేతనైనంత సహాయం చేస్తుండేది. చాలా ధార్మికబుద్ధి కలది. ఆమె వివాహితో, అవివాహితో, విధవో ఎవరికీ తెలియదు. చేతులకుగాజులుండేవి కాని ముఖాన ఎప్పుడూ కుంకుమ పెట్టినట్టు తోచదు. త్రోవతప్పైనా ఇతరుల ఇంటికిపోదు. ఆమె చక్కగా సంగీతం పాడ కలిగినా ఎవరైనా పాడమంటే పాడేదికాదు. రోజూ రాత్రి 12 గంటలకు ఏవో కీర్తనలు పాడుతుండేది. అవన్నీ వైరాగ్యాన్నీ దుఃఖాన్నీ సూచిస్తుండేవి. ఆమె, పేరు, పుట్టుపూర్వోత్తరాలూ ఎవరికీ తెలియవు. అడిగినా చెప్పేదికాదు. పురుషులంటే ఆమెకు మహా అసహ్యం. పలుకరించినా పలుకదు. పైగా కన్నెత్తైనా చూడదు. ఆడవారితో, ముఖ్యంగా చిన్న

పిల్లలతో ఆమె రోజూ ఉదయంపూట ఓగంటసేపు సరదాగా మాట్లాడేది. చక్కటి కథలు, నీతులు చెప్పేది. కీర్తనలుపాడి వినిపించేది. ఆమెకు అధ్యాత్మరామాయణకీర్తనలన్నా శంకర స్వాములవారి వైరాగ్య గీతాలన్నా ప్రాణం. ఆమె వాటినే ఎక్కువగా పాడేది.

నేను చిన్నతనంనుంచీ ఆమెను చూస్తుండేవాణ్ణి మా చెల్లెలు కమలను పాఠశాలనుంచి ఇంటికి తీసికొనిరావడానికి నే నెన్నోసార్లు వెళ్ళేవాణ్ణిపిల్లాణ్ణయినా ఆరోజుల్లో కూడా నాతో ఆమె మాట్లాడేదికాదు. ఆమె పరాకతనాన్ని చూచి లోకులు ఆమెకు పూర్తిగా విద్యాగర్వం ఉందనేవాళ్ళు. ఆమెనుగూర్చి మంచి మాట్లాడేవాళ్ళు కొందరూ, చెడుమాట్లాడేవాళ్ళు మరికొందరూ. ఏదెలాఉన్నా ఆమె నర్థంచేసికోవడం దుస్సాధ్యంగా ఉండేది. పెద్దవాణ్ణైన తర్వాత నా కామెతో పరిచయం కలుగజేసికోవాలని ఉబలాటం హెచ్చింది. ప్రయత్నించికూడా ఎన్నోసార్లు విఫల మనోరథుణ్ణైనా.

పంతులమ్మగారికి సాహిత్యం అంటే చాలా అభిరుచి ఉండేది. కొంత కృషికూడా చేసింది. మధ్యమధ్య ఆమె వ్రాసిన కథల్నూ, గేయాల్నూ పాఠశాల సంచికల్లో చదువుతుండేవాణ్ణి. మృదువైన శైలిలో చాలా రమ్యంగాఉండేవి, ఆమె భావాలు పోకడలు. కాని ప్రతిరచనా విషాదాంతంగా ఉండేది ఇదే ఆమె రచనలో ప్రత్యేకత.

మా చెల్లెల్కు, కమలకు మేము ఇంటివద్ద వీణచెప్పించేవాళ్ళం. కంఠంకూడా శ్రావ్యంగా ఉండేది. అందువల్ల పంతు

లమ్మగార్కి కమలమీాద ప్రత్యేక అభిమానం ఉండేది. ఈ అభిమానాన్ని పురస్కరించుకొనైనా ఆమెతో నను పరిచయం కలుగజేసికోవాలనుకున్నా కాని లాభం లేకపోయింది.

ఇంతలో కమల వివాహం నిశ్చయం చేశారు, మా జననీ జనకులు. వివాహానికిరమ్మని ఎంతో బలవంతంచేశాం. కాని, ససేమిరా అంది. పంతులమ్మగార్కి ముసలి ముత్తయిదువు లంటే ఎంతో గౌరవం. కనుక మా అమ్మగార్ని బలవంతంచేసి ఆమెను ఆహ్వానించి రమ్మని పంపాం. ఎంతో ప్రయత్నంమీాద 'లగ్న' సమయానికి వస్తాననిమాటయిచ్చింది. పెండ్లి కానుకగా ఆమె ఐదు ఆశీర్వచన పద్యాలు వ్రాసికొని వచ్చింది. కాని తాను చదువడం ఇష్టపడక నన్ను చదువమంది. ఆమె నాతో మాట్లాడడం అదే మొదటిసారి. భోజనం చేయకుండానే పంతులమ్మగారు పోవడం కనిపెట్టి, కమల ఎవరికీ చెప్పకుండానే ఆమెను పిలుచుకోరావడానికి పోయింది. ఎంత బలవంతంచేసినా రాలేదనీ, పైగా ఎందుకో విచారంగా కూర్చున్నదనీ, కళ్ళవెంట నీరుకూడా కారుస్తున్నదనీ, కమల తిరిగివచ్చి నాకు రహస్యంగా చెప్పింది. ఆమెకు, మా యింట్లో సరిగా గౌరవం జరుగలేదేమోయని హడలిపోయినా. వెంటనే ఆమె వద్దకు వెళ్ళా. రమ్మని ఎంత బలవంతం చేసినారానంది. ఒకవేళ మా వల్ల ఏమైనా అపరాధం జరిగితే మన్నించమన్నా. అట్టిదేదీ జరుగనేలేదంది పంతులమ్మగారు. ఇక 'శలవు' అని నమస్కరించి గృహోన్ముఖురాలైనా. వివాహం ఐన రెండుమూడు రోజుల్లోనే నాకూ

పంతులమ్మగార్కి తలవని తలంపుగా సమావేశం కల్గింది. ఒకనాడు సంధ్యాసమయంలో మా మునేటికి వెళ్ళి నేనేవో గేయాలు వ్రాస్తూ కూర్చున్నా. అదే సమయాన ఆమెకూడా ఇద్దరు బాలికలను వెంటతీసికొని అటువైపు వచ్చింది. ఆమెను చూచి నమస్కరించి

" చాలాదూరం వచ్చారు " అన్నా.

" రోజూ ఇల్లాగే పిల్లల్ను తీసుకొని వస్తుంటా" అంది పంతులమ్మగారు. ఇల్లా మాట్లాడుతూనే ఆమె దృష్టి నేను మహా భీభత్సంగా కవిత్వం వ్రాస్తూన్న కాగితాల మీద పడ్డది. వెంటనే ఆ కాగితాలను దాచాలని ప్రయత్నించేశా, నేను వ్రాసే గేయాల్ను ఇంకెవ్వరికీ చూపించేవాణ్ణి కానందు వల్ల.

" మీరుకూడా కవిత్వం వ్రాస్తారన్నమాట "

"అబ్బే లేదండీ! వ్రాయాలన్న అభిలాష ఉంది. అందుకని ప్రయత్నిస్తున్నా "

" ఏవీ! ఆ కాగితా లిలా ఇవ్వండీ "

ఇవ్వటానికి ఇష్టంలేదు. ఇవ్వకపోతే కోపం వస్తుం దేమో అన్న సందిగ్ధావస్థతో కొంచెంసేపు అనుమానించి, చివఱకు కాగితాల్ను ఆమెకిచ్చా. ఆమె గేయాల్ను చదివి "చాలాబాగున్నవి. ప్రయత్నిస్తే మున్ముందు ఉత్తమరచనాలు వ్రాయగలుగుతారు " అన్నది.

"వ్రాయటానికేం వ్రాస్తాను. కాని సంస్కరించే వారు లేరు. నా రచనలోని లోపాల్ను చూపిస్తే సంస్క-

రించుకోవాలని కుతూహలం. తమ కాలంకం లేకపోతే...
... ..."

"నాకు మాత్రం కవిత్వం విషయం, ఏపాటి తెలుసు; ఎవరైనా పండితులవద్దకు పోతే బాగుంటుంది."

"పండితుల దగ్గఱకుపోతే వారు గేయాలంటే మండి పడతారు." అంతటితో మా సంభాషణ ముగిసింది. ఇలాగే మరికొన్ని తడవలు ఆమెతో సంభాషించే అవకాశం లభించింది నాకు. ఊళ్ళో అంతా ఆశ్చర్యపడేవాళ్ళు నాతో ఆమె మాట్లాడుతున్నదని, మరే పురుషులతో నూ మాట్లాడేది కాకపోవడంవల్ల కొంతకాలానికి ఆమెకు నేను విశ్వాసపాత్రుణ్నైనా. తరుచుగా పాతఃదేవణ్ణి ఆమె తీరిక సమయంలో ఎప్పుడూ కవితాగోష్ఠి, సాహిత్య చర్చతప్ప మే మితర విషయాలేమీ మాట్లాడేవాళ్ళము కాము. ఆమెతో నాకు కల్గిన సహవాసంవల్ల ఆమె కేదో వెనుక విపత్తుకల్గినదనీ దానిని గుప్తపఱుచుచున్నదనీ, ఆ సంఘటనయే ఆమె నెల్లప్పుడూ కలవరపరుస్తున్నదనీ ఊహించగల్గా. పురుషులంటే పరాకుగా ఉంటున్నప్పటికీ మా ఇద్దరికీ పరిచయం కలుగజేసిన భారతీదేవికి అనేకసార్లు జోహారు లర్పించేవాణ్ణి.

పట్నంలో నా మిత్రులు కొంద రొకపత్రికను నడిపించేవాళ్ళు. ఉగాదిసంచిక కేదైనా కథను వ్రాసి పంపమని ఉత్తరంవచ్చింది. నేను వర్తూలమ్మగార్నికూడా ఏమైనా వ్రాయమని ప్రార్థించా. మొదట్లో నిరాకరించినా తుదకు ఒప్పుకుంది. రెండుమూడు రోజుల్లో కథనుపూర్తి చేసి చదివి వినిపించిం దిలా.

"ప్రభ జమీందారీ ఇంటిబిడ్డ. చిన్నతనంనుండీ అతి గారాబంగా పెరిగింది. ఇంటికేవచ్చి ఉపాధ్యాయులవారు ఆమెకు సంగీతం, తెలుగుచదువుచెప్పేవారు. మరో పంతులు గారు వచ్చి హిందీ, ఇంగ్లీషు నేర్పేవారు. ఆమెకు 18 ఏండ్లు వచ్చేటప్పటికి ఈ మూడు భాషల్లో చాలా వఱకు అరజ్ఞానం కల్గింది. జమీందారుగారు చాలా పత్రికలు తెప్పిస్తుండే వారు. ఆమె ఆపత్రికలనూ, సంచికల్నూ అనుదినం చదివేది. కథలూ, వ్యాసాలూ వ్రాయాలన్న ఉబలాటం ఆమె కుండేది. రాచకీయాలంటే ఆమెకు చాలా శ్రద్ధ. పత్రికలో రాచకీయ విషయాల్ను ఆమె విపులంగా చదువుతుండేది. జమీందారులు ప్రభుత్వంవారూ చేసే దుండగాలనూ, దౌర్జన్యాలనూ ఆమె భరించలేక పోయేది. ఎన్నో తడవలు తండ్రితో, ఈ విషయాల్లో వాదించేదికూడా. జమీందారుగారు ఆమె మాటల్ను లక్ష్య పెట్టేవాడుకాడు.

ప్రభకు 20 వ ఏడురాగానే జమీందారుగారు వివాహ ప్రయత్నాలు మొదలుపెట్టాడు. సమీపంలోఉన్న మరో జమీందారుని కుమారునితో ప్రభవివాహం జరుపాలని నిశ్చయంచేశాడు. ఈ విషయం విన్నప్పటినుండీ ప్రభ దుఃఖంతో కుమిలిపోసాగింది. వివాహవిషయంలో తనను సంప్రతించందే, తండ్రి నిశ్చయాని కొచ్చినందుకూ, తనకు కాబోయే మామగారు క్రూరుడనీ, త్రాగుబోతనీ అప ఖ్యాతి పడ్డాడనీ, వరుడు విద్యావిహీనుడనీ—ఇవన్నీ కార ణాలుగా ఆమెకు ఆ సంబంధంపై విముఖత్వం కల్గింది. తల్లితో ఎంతో చెప్పింది. తనను ఎందుకు విచారించ లేదని వాదించింది

"నా వివాహసమయంలో నన్నడిగిచేశారా? నేనూ మీ నాన్నగారూ సుఖంగా లేమా? తల్లీ" అన్నది ప్రభతల్లి.

"మీకు 12వ ఏటనే వివాహం జరిగింది. అప్పుడు ప్రపంచం అంటే ఏమిటో తెలియదనుకుంటా మీకు. ఆ అజ్ఞానావస్థలో మిమ్మల్నడిగినా ప్రయోజనం ఉండేదికాదు. నాక్కూడా అదేవయస్సున వివాహం చేయకపోయినారా. ఇప్పుడు చేతులార నా మెడ కోయబోతూంటే నేనెలా ఒప్పుకోవాలి" అన్నది ప్రభ వెంటనే.

ఇలా ఎంత తర్కించినా లాభం లేకపోయింది. కన్న బిడ్డ కన్నీటి ధారలైనా ఆ జమీందారుని కఠిన హృదయాన్ని కరిగించలా. ఇక ప్రభకు హృదయావేదన ఎక్కువైంది. ఇంట్లోనుండి ఎలా తప్పించుకొని పోవాలా అని ప్రయత్నం చేయడం మొదలెట్టింది. బహిరంగంగా పోయే ధైర్యంలేదు. పైగా వీల్లేదుకూడా, యమకింకరుల్లా జవాన్లు కోటవాకిట్లో అహోరాత్రుళ్ళూ పహారాఇస్తుంటారుకాబట్టి ఏమి చేయాలో కొంతకాలం ఆమెకు తోచలేదు. ఆత్మహత్య చేసికోవడం భీరుత్వమే గాక పాపమని ఆ పనినుంచి విరమించింది. ఆలోచించగా ఆలోచించగా ఆమె కో ఉపాయంతోచింది. రాత్రి పూట పెరటి గడపవైపు ఎవరూ ఉండరు. అటునుండి వెళ్ళవచ్చు. "ఎక్కడికి"? అన్న ప్రశ్నకు ఆమెకు సమాధానం దొరకలేదు. ఎండ కన్నెరుగని ఆ కోమలి ఎక్కడికిపోగలదు. ఎవరిదైనా ఆసరా కావలసివచ్చింది. ఎవర్నడగాలి. తన కంత విశ్వాసపాత్రులెవరు? అంతఃపురంలో దాసీలు, సేవ

కులుతప్ప తన కెవ్వరూ తెలియదు. వారి సహాయం అపే క్షిస్తే వారి విషయం తండ్రితో చెప్పుతారేమో అని శంకిం చింది.

ఇలా మనోవ్యాధితో రేయింబవలూ ఆమె కుమిలి పోతూంటే ఒకనాడు సరిగా అర్ధరాత్రి వేళ పెరటివైపున ఆమె కో గానం వినవచ్చింది. అప్పట్లో ఆమెకది అమరగానం అనిపించింది కాని అదేగానం ఆమెకు ప్రళయగానమైంది. ఆమె హృదయంలో ఒక మెరుపు మెరిసింది. ఆశాజ్యోతి తేజరిల్లింది. ఆ గాయకునికే 'ఆత్మార్పణం' చేద్దామను కున్నది. ఆ గాయకునితో ప్రభ ఎన్నడూ మాట్లాడకపోయినా అతనెవరో ఆమెకు తెలుసు.

ఆ గాయకుడు ఆ ఊళ్లో 'గురుస్వామి' అని పిలువబడే వాడు. గురుస్వామి విచిత్రమైన భిక్షువు. అర్ధరాత్రి వేళ భిక్షా నికి బయలుదేరేవాడదేమోగాని, ఎవరితోనూ మాట్లాడే వాడుగాడు. ఆయన దగ్గరకు వెళ్ళి భిక్ష నిస్తే తీసికునేవాడు. ఇతడు సుందరరూపి - యౌవనుడు - కాషాయివస్త్రాలను ధరించేవాడు. ఇతడంటే ఆ ఊళ్ళో జనులు భక్తిశ్రద్ధలు చూపించేవాళ్ళు.

ప్రభ దిగ్గునలేచి మెల్లగా పెరటివైపు వెళ్ళింది. గురు స్వామి పాడుకుంటూ కొంచెందూరంలో నిలువబడ్డాడు. "స్వామీ" అని పిలిచింది ప్రభ. నాడు పూర్ణిమ. చుట్టూ వెన్నెల. ప్రభ చీకట్లో ఉన్నందువల్ల కానరాక గురుస్వామి ఇటూ అటూ చూచాడు. మళ్ళీ పిలిచింది ప్రభ. గురుస్వామి

కొంచెం అనుమానించి తన పద్ధతికి వ్యతిరేకమైనా ఆమె వద్దకు వెళ్ళాడు. ప్రభ భిక్షంపెట్టుటకు మారుగా అతని పాదాలపై వ్రాలి తన అవస్థనంతా విపులంగా చెప్పి తన సేవటికైనా తీసికొని పొమ్మని వేడింది. ప్రభ దేహం వణికిపోయింది. వెంటనే స్వామి మారుమాటాడక తిర్గిపోయాడు. పోతూన్న స్వామిని పిలిచి భిక్షనిచ్చి మరుదినం అదే సమయాన అదే ప్రదేశానికి రమ్మని ప్రార్థించింది.

ప్రభ తిరిగి తన శయనాగారానికి తిన్నగా చేరుకున్నది. కాని ఆరాత్రి ఆమెకు నిద్ర పట్టలా. స్వామి ఎవరో! ఆయనను భిక్షుకునిగా మాత్రమే ప్రభ ఎరుగును. కులగోత్రాలు తెలియవు తనకు. అతనిని పతనానికి తీసికొని వస్తున్నానేమో యని కంపించి పోయింది. అతనితో తన భవిష్యజ్జీవనంలో సంబంధం ఎలా ఉండనున్నా ఆనాని సహాయానే ఇంటినుండి పోవాలని ఆమె నిశ్చయించుకుంది. మర్నాడు ప్రతిక్షణం ప్రభకో యుగంగా తోచింది. ఎప్పుడు ప్రొద్దు గ్రుంకుతుందా అని కనిపెట్టికొని ఉంది. ప్రొద్దుగ్రుంకడంతోటే అర్థరాత్రికోసం నిరీక్షించింది. గడియారం 12 కొట్టింది. పెరటివైపున స్వామిగానం వినవచ్చింది. ప్రభ కట్టుబట్టలతో బయలుదేరింది. పోతూ, పోతూ ఓసారి తల్లిదండ్రులఫోటోలకు ప్రణమిల్లింది.

స్వామి నిరీక్షిస్తున్నాడు ప్రభకోసం. ఎందుకో అతనికే తెలియదు. తన ఉద్దేశం వ్యక్తపరచింది ప్రభ. మొదట్లో ఒప్పుకోలేదు గురుస్వామి, అప్రతిష్ఠపాలౌతానన్నాడు. తనకు

నీక్షోభంగం కలుగుతుందన్నాడు. ఆమెకు సరిగా పోషణ జరుగ దేమోనని సందేహించాడు. ప్రభ ఎన్నో విధాలగా బ్రతిమిలాడింది. ఆమె వద్దనున్న ఆభరణాలను చూచి గురుస్వామి కొంత భ్రమపడ్డాడు. అతనినిగూడా మాయ ఆవరించింది. పతితుడైనాడు. ప్రభయే కారణమేమో,

రెండురోజుల్లో వా రా ఊరువదలి పట్నం చేరారు. అక్కడ సుఖంగా కాలం గడిపారు కొన్ని నెలలు. ప్రభవద్ద ఉన్న ఆభరణాలు దాదాపు అన్నీ ఖర్చైందాకా ముందు చింత వాళ్ళకు కల్గలేదు. వారిద్దరూ ఆ కొద్దిరోజులూ ఆదర్శ దంపతుల్లా కాలం గడిపారు.

ఎన్నాళ్ళీసుఖం! ప్రభ శాశ్వతసౌఖ్యానికి నోచుకోలేదు. పరమేశ్వరుడామెకొక శిశువును కూడా ప్రసాదించాడు. ఆభరణా లన్నీ ఖర్చయినవి. రోజు గడవడమే కష్టమైపోయింది. ఇక వాళ్ళ జీవనం దుర్భరమైంది. ఆపరిస్థితుల్లో గూడా ప్రభ దిగులుపడలేదు. 'లేమి' ఏమో తెలియని ఆ సుకుమారి ఆకష్టాలన్నీ భరించగల్గింది. ఉదరపోషణకై ఏదైనా మార్గం అన్వేషించమని ప్రభ స్వామిని మధ్యమధ్య మందలించసాగింది. ఇంతకూ ప్రభకు గ్రహచారం చాల లేదు. ఆమె శిశువు వ్యాధిగ్రస్తుడైనాడు. మందిప్పించాలి. స్వామి మాట్లాడడు. కుమారుడు జబ్బు పడ్డప్పటినుండీ స్వామిలో కొంత విపరీత చైతన్యం కల్గింది. ఏదో పరాకుగా ఉంటున్నాడు. బాలుని వ్యాధి ముదిరి ప్రమాదావస్థకొచ్చింది. ఓనాటిరాత్రి బాలుని కేదో మందు త్రాగించి స్వామి, ప్రభా శయనించారు. మధ్యమధ్య లేచి ప్రభ బాలుని చూస్తుండేది.

బాలుడు గురక మొదలెట్టాడు. పేగులు ఎగరడం మొదలెట్టినవి. అవన్నీ శుభచిహ్నాలని, బాలుని తాను చూస్తానని, ప్రభ చాలాసేపు మెలుకువతో ఉన్నదని ఆమెను శయనించమన్నాడు గురుస్వామి.

ప్రభ నిద్రించి తెల్లతెల్లవారుతుండగా లేచింది. స్వామి లేడు. శిశువు కదలడూ మెదలడు. విశ్వాసనిశ్వాసలు ఆగిపోయినవి. ప్రభ గోడుగోడున ఏడ్చింది. తన మార్గాన్ని వదలివచ్చి పతితుడైనానని, ఇకముందైనా వెనకటి మార్గం తిరిగి అవలంబించాలని, అందువల్ల ప్రభను వదలి పోతున్నానని గురుస్వామి గోడమీద వ్రాసి వెళ్ళాడు. తను నమ్ముకున్న స్వామి లేడు. తన గారాబుపట్టి, ముద్దుమూట పంచభూతాల్లో లీనమైనాడు. ప్రభకు మతి స్థిమితం తప్పింది. బాలునలా నేవదలి స్వామీ! స్వామీ! అంటూ ఎటో పరుగెత్తింది.''

పంతులమ్మ కళ్ళు అశ్రుపూరితాలైనవి. ఎందుకో నాకే తెలియదు. కళ్ళనీళ్లు తుడుచుకొని కథను, నా కన్నీళ్ళతో సహా, చించివేసిందా కాగితాలను. నన్నా సమయంలో వెళ్ళమనీ, మళ్ళీ రమ్మని ప్రార్థించింది రుద్ధకంఠంతో. నాకేమీ అర్థం కాకపోయినా గృహోన్ముఖుణ్ణైనా.

(10)

ముష్టి పడుచు

—సింగరాజు లింగమూర్తి

పదునాలుగేడులూ పయిబడ్డనొక బాల
దీనవదనముతోడ తరలింది వీధుల

చినిగినా బట్టల్లొ చెరిగినా జుట్టుతో
చెమటబిందువులెల్ల చిందులాడంగాను

ఎర్రన్ని ఎండలో వడగాడ్పు సుడులలో
నిలుచుండి అడిగింది ఆముష్టిపడుచు

"బాబయ్య బిచ్చము పుణ్యముంటదినీకు
పట్టెడన్నము బెట్టు నీవైనదొరసాని

కడుపులో ఆకలి కలచివేస్తున్నాది
కళ్ళల్లొ ప్రాణాలు కదులుతూఉన్నాయి"

"ఏళపాళాలేదు అన్నమేడున్నాది
పోమె పిల్లా" అనియె కాపుముసలీ దొక్కతె

అంతటా ముష్టిదీ ఆకలీ బాధతో
తడబడెడి అడుగుల్తొ తరలింది ఒకవేపు

"దండమూ దొరసాని దండమూ దొరబాబు
పట్టెడన్నము బెట్టి ప్రాణాలు నిలుపండి

ముందుజన్మలో మీకు బిడ్డనై పుడుతాను
ఈజన్మనన్ గాచి శుభములూ బడయండి"

" రేషనూబియ్యము అర్ధశేరిస్తారు
అందులో సగపాలు జొన్నలో గోధుమలో

ఒకపూట అన్నమూ ఒకపూట రొట్టె
అవి చాలకే మేను అలమటిస్తున్నాము

నీకేమి పెడుదురే నిన్నెవరు తలతురే
పోయిరా వేపడుచ పోయిరావే చాలు!'

గంటలూ తరబడిగ ఇండ్లెన్నొ తిరిగింది
పట్టెడన్నంబైన పెట్టలేదెవ్వారు

సొక్కుచూ సోలుచూ తప్పటడుగులు వేసి
వివశతన్ తలపోసె ఆముష్టిపడుచు

" "ఏజన్మలో నేను ఏ దోసగుచేశానో
ఈజన్మలో నాది వ్యర్థబతుకయ్యాది "

గుండె దడదడమనగ ఒడలువణకుచునుండి
సోషొచ్చి పడిపోయె ఆదీనబాల

అంతలో నొకకారు అమితవేగము వచ్చి
ఆబాలపయినుండె 'బాంయ్'మనిపోయింది

దానధర్మాలకూ దాక్షిణ్యదృక్కులకు
పెట్టుపోతలకైన భారతావనియంద్రు !

ఆనాటి దాత్రలూ ఈనాడు లేరో ?
ఆనాటిభారతీ ఈనాడు కాదో ?

పట్టెడన్నము లేక ప్రాణాలు బాసింది
శాంతికై ఆబాల స్వర్గానికేగింది

*　　*　　*

సత్యధర్మాలైన ధరణిలోనే వేళ
జయమొందలే వనెడి నార్యోక్తి నిజమాయె !

ఈభూమిలోనీకు తావు లేదని ఏమొ
కర్మపరిపక్వాన గొంపోయె నీమడే !

పెరటిచెట్టు

—కస్తూరీదేవి

పోరుపెట్టి ఏడుస్తున్న కళని వదినగారి చేతుల్లోంచి అందుకుని ఆడిస్తూ వరండాలో అన్నగారిదగ్గర కొచ్చింది ఆమె. ఎంత ఆడించినా వూరుకోక మారంచేస్తోంది కళ. ఏదో చదువుకుంటూన్న ప్రకాశ్ కళ ఏడుపుకు చికాకు పడుతూ చెల్లెలివేపు చూసి "రాణీ! దాన్నవతలకు తీసు కెళ్లరాదూ?" అన్నాడు.

"నీ దగ్గిర కొస్తుందట న్నయ్యా!"

"నేను చదువుకోవాలి, యిప్పుడుకాదు."

మళ్లీ చదువులో పడ్డాడు.

"ఏం చదువుతున్నా వన్నయ్యా?"

............"ఏదో కథ"

"ఎవరు రాశారూ?"

"ఎవరో యిందిరాదేవట"

"బావుందా కథ?"

"ఓమోస్తరుగా వుంది."

"ఊఁహూఁలాఁ" అంది రాణీ యీసుగా.

ప్రకాశ్ దిద్దుకున్నాడు. "ఏదో ఉందిలే. యీమాత్రం మీరు రాయలేరూ? నిజంగా రాణీ! పగలల్లా వృథాపుచ్చక పోతే చిన్నచిన్న భావాల్తో మీరందరూ కథలురాసి ప్రక

టించకూడదూ? నాకోరికకు దగ్గట్టుగా మనయింట్లో కథలు రాశేవాళ్ళెక్కడా లేరు''

భావనేకాని కర్తవ్యం శూన్యం. రాస్తే హర్షించే వాళ్ళున్నారా అనుకుంటూ అన్నగారిని రంగంలోకిదింపుదా మనిరాణి అంనుకుంది.

"కాస్త చదువుకున్నది వదిన కథలురాస్తే తమాషాగా వుంటుంది.'' ప్రకాశ్ నిట్టూరుస్తూ'అంత అదృష్టమా!'

"ఓవిధంగా ఆలోచిస్తే ఆవిడరాసేదేమొలనిపిస్తుంది. ఈ సంసారపు గొడవల్లో ఎక్కడి సాహిత్యం? ఎక్కడి భావాలు?'' "రాణీ! భావాలంటే లడ్డువుండలా ? గట్టిగా చిదుపుతే చితికిపోటానికి,అయినా యీమాత్రపు చిట్టిసంసారానికే తుపానులురేగి యెదదలోని భావాలు యెగిరిపోతాయా?''

"కాకపోవచ్చు. కాని చేయూతకూడా అవసరం అన్నయ్యా! సాహిత్యసాధనకు ప్రత్యేకం దానికోసంపుట్టిన పుణ్యమూర్తుల కక్కర్లేకపోవచ్చు.''

"ప్రత్యేకమంటూ కొంతమంది వుడతారా?''

"ఇల్లా అంటావుకాని అన్నయ్యా! రవీంద్రునిలాంటివారి సంగతేమిటి? ఆయన కళ నుద్ధరించటానికే పుట్టాడు. అందుకే ఒకరిచేయూత లేక తన పని నిర్వహించాడు. మాట వరుసకు, వదిన యెప్పుడొక కథ రాసిందనుకో. నీ వామెను ప్రోత్సహిస్తావా?

"ఛీ! తప్పకుండా''

" నిజంగా ? "

" నిజంగా. "

" ఐతే వుండు. వదినా ! నీకథ యేదమ్మా ?" అంటూ లోపలికి వెళ్ళింది రాణి. ప్రకాశ్ రెండుమూడు నిమిషాల దాకా చూసి యీసడింపుతో మళ్ళీ చదువుకోటం మొదలెట్టాడు. పదినిమిషాల్లో రాణి పరుగెత్తుకుంటూ వచ్చింది.

" అన్నయ్యా ! వదిన మనయింటికి రాకముందు రాశిన కథొకటుంది. చదవనా ? "

తన చదువు కీ చవటకథ అంతరాయం కలిగించిందని లోలోపల విసుక్కుంటూ పైకి " ఊఁ కానీ " అన్నాడు. " ఇదిగో విను " మని రాణి ఈ క్రిందికథ చదివింది.

ఆవేళ లేచి ఎవరిమొహం చూశానోకాని అన్నీ వడసల్లే. మొహం కడుక్కుందామని పళ్ళపొడి సీసాతీస్తే, అది కాస్తా చేయిజారిపడి పగిలిపోయింది. దానితో ప్రారంభం అమ్మ అక్షింతలకు మొహం కడుక్కుని స్నానం చెయ్యడానికి వెడితే బాయిలర్‌లో నీళ్ళు చల్లగా వున్నాయి. అవే కిక్కురుమనకుండా స్నానంచేసి బయటపడ్డాను బాత్‌రూములోంచి. అన్నానికి కూచుంటూ మంచి నీళ్లు దగ్గిర పెట్టుకోటం మరచినందుకు, కూర్చోటంలో ఒకకాలికి మరోకాలు మడుచుక్కూర్చున్నందుకూ చిల్లర చివాట్లు- మొత్తానికి సాయంత్రం దాకా రుసరుసలు ధుమధుమలూ భరించుకొచ్చాను. ఆపైని వళ్ళు మండిపోయి ఎవ్వరితోనూ మాట్లాడకూడదని నిశ్చ

యుంచుకున్నాను. ఊరికే కూర్చుంటే యేమీ తోచలా. అందుకని "పాలవెల్లి" కథల సంపుటితీసి అందులో సోదరి సావిత్రి వ్రాసిన "ఆహుతి" అక్కడక్కడా చదివాను. నేను కూడా ఓకథ రాయాలనిపించింది. వెంటనే బొగ్గులడబ్బా దగ్గర పొయ్యి రాజేసుకోటానికుంచిన కాగితాల్లో రాయని రూళ్ళకాగితాలు రెండు యేరి తెచ్చుకున్నాను. పెట్టెల చాటున దుమ్ముకొట్టుకుపోయిన బొటనవేలంత రంగు పెన్సిలు వెతుక్కు తెచ్చుకుని కత్తిపీటతో చెక్కి బ్రహ్మాండంగా కథ రాయటానికి పూనుకున్నాను. సరే గంటన్నరైంది. నా కథ కంచిదాకా పోయేట్టులేదు. విసుగెత్తి కాగితాలు పలకక్రింద పెట్టి కథ కాళ్ళు కుంటుబడ్డాయేమా అని ఆలోచిస్తూ వాకిట్లోకి వచ్చాను. ఎవరో ఒక అమ్మాయి పాపం, చంకనుజోలి, చేతిలో తాంబురతో పాటపాడుకుంటూ మా యింటికి వచ్చింది. జాలేసింది నాకు చాలా. మా లక్ష్మిని భిక్షం పెట్టమని సిఫార్సు చేశాను. ఇంటికామె పెద్ద కనుక- ఆమె ఆజ్ఞలేనిదే మరొకరు పెట్టరాదు కనుక. ఆమె చాలా క్రూరంగా "కొత్తబిచ్చం పొద్దెరగదుట. యిప్పుడేమి" టని అదలించింది. అమ్మాయి యీ చివాట్లను మారు మాటలేక జోలి నేసుకని ప్రక్క గుమ్మం త్రొక్కింది, "సీతారామ స్వామి నేచేసిన నేరములే" మంటూ బయటి కురికే యేడ్పును పాటతోలో నెట్టుతూ వయసు ముదురు చూపులతో ఆ యింటి కుర్రాడు దుడుకు ప్రశ్న వేశాడు "మీఅమ్మ కెన్నేళ్ళని. "ముసలిదా, నీ వెందుకు బిచ్చమెత్తుతున్నా" వని పరుషను

కోవాలనిఅతనికోరిక“ అమ్మ లేదుగా!”అందిభిక్షుకి—ఓడిన మొగంతో గెల్చినట్టు భావించి బైటపడ్డాడు వెకిలినవ్వుల రాయుడు. ఆ వెనుకే తప్పటడుగులపారాడు పిల్ల వచ్చీరాని మాటల్తో “అప్పచ్చితింతావా”అంది.“అన్నంతింటా”నంది భిక్షుకి. లోపలికిపోయి అమ్మను లాక్కొచ్చింది. ఆ ఇల్లాలు భిక్షుకిని పరామర్శించింది. భారతాంబ పడమటి యీాదురులో కొట్టుకుపోతూన్నా తన ధార్మికత్వాన్ని పూర్తిగా వదలలేదు! భిక్షుకికి తల్లిదండ్రులు లేరు. అన్న మెరుగదు ఆ ప్రొద్దుటినుండి. ఇల్లాలు ఆతిథ్యమిచ్చింది ఆ పండుగపూట. తప్పటడుగుల పిల్ల తన యింటికి దారి జూపించి దిక్కులేని పిల్లకు.

కన్నీరు తుడుచుకుంటూ నేనూ లోపలి కెళ్ళాను. మర్నాడు ఆ అమ్మాయి కాంగ్రెసువారి ఉచిత నిర్మాణ కార్యక్రమ శిక్షణకై వెళ్ళిందని విన్నాను. దీనులకాంగ్రెస్!”

అని రాణి తనకథ పూర్తిచేసింది.

“ఎల్లావుం దన్నయ్యా ?”

“దాని మొహంలాగుంది” అన్నాడు తన ఉక్రోషాన్ని వెళ్ళగక్కుతూ.

“అలా అంటావుగాని అన్నయ్యా, తొలిప్రయత్నమేమైనాచక్కనిగిలుకు కాదూ? దానికి వెలుగులుంటేవదినవన్నె కురాదూ? వదిన యింకావాళ్ళింట్లోనేవుంటే మంచికథకురాలయ్యేది. ఆడవాళ్లకు అత్తవారింటికివచ్చాక బుద్ధి సంసా

రాని కేగాని సాహిత్యానికి వినియోగపడదు. వినియోగింప రాదుకూడ. అది సంసార రక్షణ చట్టానికి విరుద్ధచర్య. ''

" మంచి లెక్చరు కొట్టావుగాని, అత్తవారింటికి వచ్చాకే తమ తెలివి తేటల అభివృద్ధి చేసుకున్న వారున్నారు."

"ఔను వేయికోకరు. పుణ్యపురుషుల ప్రోత్సాహంతో. మిగిలిన భర్తలు, పెరటిచెట్టు మందుకు రాదన్నట్లు, దారి స్త్రీలసాహిత్యానికి చూపరు, చేయూత నీయరు. ఒళ్లు మంట లుంటాయి తమకులేని అభిరుచి తమ భార్యల కున్నందుకు."

" చాల్లే, స్వాతంత్రజెండా యెత్తావు స్త్రీ విద్యా సమస్య పరిష్కారానికి" అంటూ కళని కసిరాడు అది తన పుస్తకం లాగిందనే నెపంతో.

" వాదన మనవంతా రాణీ!" అంటూ వదినగారు కళని తీసుకుపోయింది.

ప్రబోధము

—సింగరాజు ధారాధరరావు

భారతావనిలోన ప్రభవించినావు
భారతీయుని పేరు నిలుపవలె నీవు

వీరబొబ్బిలి తాండ్ర పాపయ
రామరాయలు కృష్ణరాయలు
ప్రతాపదేవ శూర శివాజీ

ఏలినట్టి

భారతావనిలోన ప్రభవించినావు
భారతీయుని పేరు నిలుపవలె నీవు

స్వాతంత్ర్య వీధిలో
శుభ్ర జ్యోత్స్నలయందు
స్వీయ భారతి యెంతో
సమ్మోద మొందుచూ

వరలినట్టి

భారతావనిలోన ప్రభవించినావు
భారతీయుని పేరు నిలుపవలె నీవు.

ఆషాఢకన్యా!

-- విష్ణుభొట్ల కామేశ్వరరావు

ఓహో ఆషాఢకన్యా!
ఓహో ఆషాఢకన్యా!

పచ్చి యారని
తొలి సంజపా
రాణి శోభల
సలముకొని వచ్చేవా?

ఇంద్ర నీలము
లార జిమ్ముచు
జాలు ముత్తెపు
జడులలో
పృథివిపై కాలూనకే
వ్యోమ పథముల నంటకే

ఒదిగి నడచుచు
పెండ్లి కొమరిత వై
వచ్చేవా

ఓహో ఆషాఢకన్యా!
ఓహో ఆషాఢకన్యా!

లయను గలిపి
ప్రేమరాగము
నాలపించుచు

జగతి నంతా
మోహ ఝరులా
ముంచివేయగ

నచ్చేవా

ఓహో ఆషాఢకన్యా!
ఓహో ఆషాఢకన్యా!

అస్తమయం

—జమ్మలమడక పూర్ణచంద్రరావు

అస్తమయమా ? అప్పుడే !!!

ప్రొద్దున అతని వెంబడించి తుపాకీతో కాల్చాను. అతనాఖరిగుళ్లు నాపై పేల్చాడు చనిపోతూ. తొడచీల్చుకుని యిరుక్కుం దొకటి. మోకాటిచిప్ప తొలగించింది రెండోది. పడిపోయాను. అప్పుడే అస్తమయమా ? పగ లెలా గడిచింది ?

పశ్చిమ మంతా హత్యాభూమి. త్రొక్కితే ఊరుతోంది రక్తం. సూర్యుడు పిరికిపంద. హత్యల పరిణామాన్ని చూసి బెదురుతున్నాడు. పట్టింపు లెరుగడు. ఆత్మరక్షణ హత్యకు ప్రభుత్వరక్షణ హత్యకూ ఎంత భేదం ! మారుమూలల్లో నోరు మూతలతో హత్యకూ రణభూమిలో భేరిమ్రోతలతో హత్యకూ ఎంత భేదం ! ఒకేమాట కిన్ని అర్థా లెవరు కల్పించారో ! ఒకే సాధనకు ప్రత్యేకహక్కు లెవరు నిర్మించారో !

కుప్పలాపడి ఉన్నాడతడు. నోటివెంట కారి కాల్వలై గడ్డ కట్టింది రక్తం. ఎరుగ నింతకుముం దతనిని. ఈ యుద్ధభూమిలోగాక వేరొకచోట కలిస్తే ఒకరినొకరము గౌరవించుకునేవారముకామా? ఆదరించుకునేవారముకామా? ఇప్పుడీ మాత్సర్య మెలా పుట్టింది? 'యుద్ధ' మనే రెండక్షరాల్లో ఉన్నదా యీ మహాశక్తి? ఎవరికి యుద్ధం? ఎందుకు యుద్ధం?

మూలనుండి ప్రోత్సహించే దెవరు? మునుకొచ్చి ప్రాణ మిచ్చే దెవరు? ఉత్తమజాతియట మానవునిది? ఒకరొట్టివేస్తే కరువమన్న వానిని కరుస్తుంది కుక్క. సైనికుడూ అంతే. పొట్టకూటి కొకరి అండ జేరువాడు. చంపమన్న వారిని చంపువాడు. వీలుతప్పితే తానేచస్తాడు. ఎందుకు? బ్రతకటానికొచ్చిన భంగపాటా చావు? ప్రాణాలనివ్వలేని నాయకులకు తీసుకునే అధికార మెవరిచ్చారు? మేకలూ, కోళ్లలాగేనా సైనికుని బ్రతుకు? అవసరము వరకు మేపటం ఆ పైని చంపటం? ఇన్ని చావుల పరిణామం? యుద్ధం ముగుస్తుంది కొన్నాళ్లకు బహుశః యిరుపక్కలా చచ్చేవారు లేక. గౌరవప్రదంగా సంధి కుదురుతుంది. గౌరవాలు నాయకులకు గోరీలు సైనికులకు.

గండుచీమలతని గుండెల కండలు చెండిచూస్తున్నాయి. మానవత్వపు మచ్చుముక్కలకా? పద్దెనిమిది రూపాయల కమ్ముకున్నట్లు తెలియదు వాటికి!

వీరు డితడు యుద్ధపరిభాషలో! చచ్చేముందు తన ప్రతీకారం తీర్చుకు మరీ పొయ్యాడు. ఈ కాలు కదుప వీలులేకుండా ఉంది. ఎంతబాధ! ఈ మొండిప్రాణా లీ గుండెల్లో యెంతకాల ముంటాయో! కళ్లు మసకలు క్రమ్ముతున్నాయి. మెదడులో ఏమేమో యోచనలు పుట్టి కుప్పలై చచ్చిపోతున్నాయి.

నాలుక చుట్టుకుపోతోంది. 'వాటర్ బాటిల్' ఉన్న ట్రుప్పదతని దగ్గర. చేరేదెలా? కదిలితే—అబ్బ! యమబాధ. గుండె తూసుకుపోయినా బాగుండేది. ఈడ్చేస్తోంది దాహం.

ఒక్క అంగుళమూ ఇంత ప్రయత్నానికి జరిగింది! పదడుగు లున్నట్టుంది. ఎలా చేరటం...... అదృష్టానికికళ్ళున్నాయి— దాహం తీరింది. బ్రతికి నే నపకారంచేస్తే చచ్చి ఉపకారం చేశా డీతను.

కారుచీకట్లలో, దిక్కు లేక యమయాతనలతో చచ్చి పోతున్నానని అమ్మ కేం తెలుసు? మా అబ్బాయి వస్తాడు ఇక—వస్తాడు—మరివస్తా''డని దారులుకాస్తుంది. విజయుడై వచ్చిన వాని కెలా స్వాగత మియ్యాలా అని యోచిస్తుంది. యుద్ధవార్తలు చదివిస్తుంది కోడలితో. చచ్చిన సంఖ్య మన వారిది చాలా తక్కువ. తృప్తికరమైనవార్త. అందులో తన కొడు కుంటాడా? ''ఛీ! పాడుతలపు! వాడు చిరంజీ''వని భావిస్తుంది. దీవిస్తుంది. ప్రతితల్లీ ఇంతే. అయితే చచ్చే దెవరి కొడుకులో! యుద్ధం పూర్తిఅయి సంధి కుదిరినట్లు వింటుంది. రేపోమాపో ఓడ దిగుతా డనుకుంటుంది. కళ్లు కాయలు కాస్తాయి నిరీక్షణతో. చచ్చినవారి పట్టీకూడా వస్తుంది. లేడం దులో తన కొడుకు. సంతోషం—బ్రతికిఉంటే రాడేం? శత్రు వుల ఖైదీ అయివుంటాడు. సంధిషరతుల ప్రకారం శత్రు పక్షం ఖైదీలను విడుదలచేస్తుంది. అయినా రాడు తన పాపడు. ఏమైనట్లు? అస్తమయమా? తల్లి హృదయం చిల్లి పడు తుంది శంకతో. ఇంతలో వస్తుంది మెఱుపు అచ్చులో కరకు వార్త—ప్రభుత్వ సానుభూతి. ఆరడుగుల కొడుకును ఆరంగు ళాల్లో దర్శనమిప్పించింది ప్రభుత్వం!

నాన్న ఫోటో చూపిస్తుంది నా పాపాయికి తల్లి. ఫోటో వద్దు. నిజంగా నాన్నను చూపించ''మనిమారాముచేస్తుంది

పాపాయి. కంట నీరు క్రుక్కుకుంటుంది తల్లి. మరిపిస్తుంది పాపాయిని తాను మరువకుండా. నవ్విస్తుంది పాపాయిని— తాను లో నేడుస్తూ!

మళ్లీ వచ్చాడీసూర్యుడు. హత్యాకాండ తిరిగి ప్రారంభం. ఎన్నిసార్లు త్రాగినా తీరటంల్లే దాకలి నీటికో. వాటర్ బాటిల్ కాళీ అయింది. ఎండ చిర్రుమంటోంది. అబ్బ! దుర్వాసన పట్టింది దీశవం! అప్పుడే యెప్పుడు పసిగట్టాయి ఈ గ్రద్దలు? పీక్కు తింటున్నాయి—ఎంత రాక్షసము! మనిషి కంటేనా? చంపుతా ననుకుంటాడు ప్రతిసైనికుడు. చచ్చిపోతా ననుకుంటే యుద్ధాలే యుండవేమొ!

భగవాన్! ఇకనావంతా? బ్రతికి ఉండగా చిత్రవధా? వీటి నదలించే శక్తి లేదు. నాలుక ముడుచుకుంటోంది. తెలివి ... అస్తమయము!

రాష్ట్రగీతి

—శేషగిరిరావు

వందే మహాంధ్ర మాతా! వందే స్వధర్మభూత!
దేవావాసయోగ్యా! సకలార్థలోక నాకా!

మగధస్థ శిరకిరీటా! ప్రాగ్దిశాంసవస్త్రా,
తంజాపురస్థ పాదో! స్వస్వరూపాంధ్రమాతా॥

సర్వార్థ గర్భయోషా! మకరంద మధురభాషా
వేదాంతి రార్య గేయా! జాతీయ ఘనచరిత్రా

చేపుమను గోమధూళీ! నవధాన్యక్షీరధారా
ఈ పెదవు లిట్టు లెండ! ఆపాత్ర లిట్టె నిండె!॥

రతనాలు నీదు రాళ్లూ! నీమన్ను మంచి పైడీ
బిడ్డలను మన్న, రాళ్లా! చూపితివి రొట్టె నడుగా॥

పశ్చిమపు పర్వతములా పాతుకొనియున్న నిధులా
పెకలించి మాగృహాలా వేతు నీ 'నదికరాలా'॥

పాస్సింధు! కృష్ణవేణీ! గోదావరి వంశధారా
మంజీర! తుంగభద్రా! పెన్నా! మునేరుమిషలా,॥
నాచికా శిక్షణకునై ఉరమురము తీరములుగా
తీర్చావు కన్న తల్లీ! సుతులన్న నెంత ప్రీతో!॥

దిక్తట వ్యాప్త సుయశోమణి శిరోభూషకాంతీ
దిక్పాశితకర కనక ఘంటానినాద గీతీ
తొలి సుతులు నాడు నీకూ మురిపెమున కట్టుకొన్న
పట్టు సెల్లాల నిన్నూ! దర్శించ నోతునమ్మా

విద్యుత్ శక్తిపోనీ! తుదకన్న శక్తినైనా
నిర్మించుకొనకపోయే! నీబలగ బలముసుంతా

జల పవన శక్తులన్నీ! సంధించి జనక జననీ
సకలాంధ్ర సామ్యధర్మ స్థాపనము చేతుమమ్మ

కాలముల నాటి ఆంధ్ర వాయువులు కలుషపడెనో
ఎఱుపిఁక మాయలేదే! పల్నాటికడలనోడ్చే
స్వేచ్ఛాతరంగములలో పరతంత్ర రేణువ్రాదీ!
నీ సుతులు తిరుగునట్టి రోదసిని నించుమమ్మా

ఒకటిగా మేలుకాంచీ! ముక్కోటి తెలుగుతలలూ
నీపాదపీఠి నిలిపి! కంకణ కరములు మోడ్చి.

సతభావిశుభముకైనా! త్యాగాతపమున నీకు
స్వాతంత్ర్యస్తంభములపై మంటపాల్ వేతుమమ్మా!

సాధన సమితి పోషక వర్గము

మహారాజ పోషకులు

శ్రీ శ్రీ శ్రీ విజయనగరం మహారాజా వారు

రాజపోషకులు

శ్రీ	వీరారెడ్డి నారాయణ రెడ్డిగారు	(చిన్నమదూరు)
,,	శిరాన్నం సత్యనారాయణ గారు	(సికింద్రాబాదు)
,,	అర్వపల్లి రామకృష్ణ గారు	(ఖమ్మంమెట్టు)
,,	గెల్లా ముత్తయ్యగారు	,,
,,	గెల్లా కేశవరావుగారు	,,
,,	కారంశెట్టి నరసయ్యగారు	,,
,,	సుగ్గల తిరుమలరావుగారు	,,
,,	కొండె సూర్యనారాయణగారు	,,
,,	బెల్లంకొండ కృష్ణమూర్తిగారు	,,
,,	దాచేపల్లి వెంకటరామనరసయ్యగారు	,,
,,	రాయపూడి రంగయ్యగారు	,,
,,	సుగ్గల నాగేశ్వరరావుగారు	,,
,,	మిరియాల నారాయణగుప్తగారు	(మధిర)
,,	చలువాది నాగభూషణంగారు	,,
,,	ఆకుల లక్ష్మీనారాయణగారు	(ఇల్లెందు)
,,	మొరిశెట్టి లక్ష్మీనరసింహంగారు	(కొత్తగూడెం)
,,	కంభంపాటి పుల్లయ్యగారు	,,

పోషకులు

శ్రీ	ఇల్లిందల రామచంద్రరావుగారు హెచ్.సి.యస్.	(హైద్రాబా
”	ఎ. ఐ. విద్యాసాగర్ గారు, హెచ్. సి. యస్.	”
”	గొర్తి లక్ష్మీనారాయణగారు	(సికింద్రాబాదు)
”	ములుగూరి పుల్లయ్యగారు	[మధిర]
”	కురువిళ్ల నారాయణగారు	[ఖమ్మంమెట్టు]
”	రాయప్రూడి రామకృష్ణయ్యగారు	”
”	సోమా కోటయ్యగారు	”
”	గడ్డం చిన నరసింహంగారు	”
”	కొంకిమళ్ల చంద్రశేఖరంగారు	”

Acc No. 2355
Class No H·262
Book N. 15

ఆచార్య కురుగంటి సీతారామయ్యగారి కృతులు

అలంకార తత్త్వవిచారము

తంజాపు రాంధ్రనాయకరాజ చరితము

ఆదర్శప్రభువు

నవ్యాంధ్రసాహిత్యవీధులు

కథాత్రయి

కొండఱు తంజావూరు కవులు-పండితులు

HAND BOOK OF TELUGU LITERATURE

— రానున్నవి —

వ్యాస లహరి (4 భాగములు)

దాక్షిణాత్య దార్శనికులు

SANSKRITIC STUDIES

ESSAYS—HISTORICAL & LITERARY

నవ్యాంధ్రసాహిత్యవీధులు (ద్వితీయ ముద్రణము)

★

హైదరాబాదాంధ్రసాహిత్యపరిషత్తు

89, బి, నాంపల్లి, హైదరాబాదు ద.

సాధన సమితి ప్రచురణములు

1. అంజలి ... వివిధ రచయితలు
2. ప్రేంచంద్ అనువాదాలు ... శ్రీ నెల్లూరి కేశవస్వామి
3. పరీక్షచదువు ... శ్రీ భాగి నారాయణమూర్తి
4. నిర్మాణము ... శ్రీ 'సాధక'
5. పాలవెల్లి ... వివిధ రచయితలు
6. భోజరాజు ... శ్రీ గాదిరాజు వేంకటరమణయ్య
7. మధుకణములు ... శ్రీ పిల్లలమఱ్ఱి వెంకట హనుమంతరావు
8. సాంధ్యగీతి .. శ్రీ సూర్యచంద్రములు
9. వాహ్యాళి ... శ్రీ బూర్గుల రంగనాథరావు
10. భగ్నహృదయుడు ... శ్రీ భండారు చంద్రమౌళీశ్వరరావు
11. ఆముక్తమాల్యద పర్యాలోకనము ... శ్రీ వెల్దండ ప్రభాకరరావు
12. సాహితీ విపణి ... వివిధ రచయితలు

సాధనసమితి : సికిందరాబాదు